www.janasakthionline.com

# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

సంపుటి : 47   సంచిక : 5,6   విజయవాడ   20-7-2014   పేజీలు : 8   వెల : రు 5.00

**సామాన్యుని జీవనాన్ని దుర్భరం చేస్తున్న బిజెపి ప్రభుత్వ కేంద్ర బడ్జెట్టుకు వ్యతిరేకంగా రాష్ట్ర కేంద్రాలలో నిరసన కార్యక్రమాలు చేపట్టండి.**

**- సిపిఐ(ఎం-ఎల్) కేంద్ర కమిటి పిలుపు**

## కేంద్ర ప్రభుత్వ బడ్జెట్టు 2014 - 15

## విదేశీ పెట్టుబడికీ, బడా బూర్జువాలకూ దోపిడి సాగించే స్వేచ్ఛనిచ్చి సామాన్యుని జీవనాన్ని దుర్భరం చేసిన దివాళా ఆర్థిక వ్యవస్థ

**దేశంలో** వర్షాభావ పరిస్థితి భయం గొల్పుతున్నది. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్టు ప్రవేశపెట్టిన జూలై 11 నాటికి సాధారణంకంటే 43 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. మధ్య భారతంలో 61 శాతం, పశ్చిమ భారతంలో 52 శాతం దక్షిణ భారతంలో 35 శాతం తక్కువ వర్షాలు పడ్డాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలలో వానలు 45 శాతం తక్కువగా వుండి రిజర్వాయర్లలో నీరు రికార్డు స్థాయికి 67శాతం లోటుకు పడిపోయాయి. జులై నెలాఖరు వరకూ ఋతుపవనాలు బలహీనంగానే వుంటాయని వాతావరణ శాఖ అంచనా. గత నాలుగు దశాబ్దాలలోకెల్లా తీవ్రమైన కరువు 2009లో వచ్చింది. ఆనాటి కంటే తీవ్ర దుర్భిక్ష స్థితి ఈనాడుంది. గత ఏడాది 57 లక్షల హెక్టార్లలో నూనెగింజలు సాగుకాగా దానిలో 80 శాతం భూమిలో ఈ ఏడు సాగు మొదలుకాలేదు. 2009 నాటి ప్రత్తి పంట విస్తీర్ణంలో 40 శాతంలో మాత్రమే సాగుపనులు మొదలుపెట్టారు. వరి, తృణధాన్యాలు, పప్పు పంటల విస్తీర్ణంలో 2009 నాటితో పోలిస్తే 20 శాతం తక్కువ భూమిలో నాట్లు పడ్డాయి. వాతావరణ శాఖ మధ్య భారతంగా పిలిచే ఒడిషా, మధ్యప్రదేశ్, గుజరాత్, దక్షిణ రాజస్థాన్‌లలో ఇప్పటికే కరువు పరిస్థితి దాదాపుగా ఏర్పడింది.

జల విద్యుదుత్పత్తి ఆగిపోవటంతో దక్షిణాది రాష్ట్రాలలో విద్యుత్తు లోటు 7 శాతానికి చేరింది. ఉత్తర రాష్ట్రాల నుండి కొనుగోలు చేయటానికి గ్రిడ్ సామర్థ్యం తక్కువగా ఉంది. ఇదే అదునుగా ప్రైవేటు విద్యుదుత్పత్తిదారులు రేట్లను 7 నుండి 19 రూ॥ల వరకూ పెంచివేశారు. దీనితో మెట్ట ప్రాంతాల్లో బోరుబావుల సేద్యం కూడా డోలాయమాన స్థితిలో పడింది.

ఈ వివరాలు దేశం మీద కరువు విరుచుకుపడబోయే ప్రమాదాన్ని సూచిస్తున్నాయి. కొన్ని కోట్ల పేద, మధ్యతరగతి రైతాంగం, వ్యవసాయ కూలీలు కడుపు చేతపట్టుకొని పని వెతుక్కుంటూ వలసల బాట పట్టాల్సి వస్తుంది. ప్రభుత్వం వెంటనే సహాయక చర్యలు చేపట్టకపోతే సామాన్యుని జీవనం దుర్భరమౌతుంది.

కేంద్ర ఆర్థికమంత్రికి ఈ కరవు పరిస్థితి తన బడ్జెటు ప్రసంగంలో పేర్కొనదగినదిగా కన్పించలేదు. కరువు ఏర్పడగల స్థితిని హెచ్చరించి, దానినెదుర్కొనే సన్నాహక చర్యల గురించి పెదవి విప్పకుండా, ధరల నియంత్రణకు తన వద్ద మంత్రదండమేదీ లేదంటూనే, ఆహారధాన్యాల ధరలు పెరిగితే (ఇప్పటికే పెరగనట్లు) ప్రభుత్వ గోదాముల్లో ధాన్యనిల్వలు పుష్కలంగా వున్నాయి గనుక ఆందోళన చెందనవసరం లేదన్న శుష్క హామీనిచ్చాడు. ప్రజల జీవనంపట్ల పాలకుల ఈ నిర్లక్ష్యవైఖరే ఆర్థికమంత్రి రూపొందించిన బడ్జెట్టులోనూ కన్పిస్తున్నది.

### అడకత్తెరలో రైతాంగం

ఈ దుర్భిక్ష పరిస్థితుల్లో పంటరుణాలను రైతాంగానికి పెంచి, అందుబాటులో వుంచాల్సిన అవసరం పెరగ్గా, వ్యవసాయ రుణాలను గత ఏడాది స్థాయిలోనే 8 లక్షల కోట్ల రూ॥లకు పరిమితం చేసిన ఆర్థిక మంత్రి, బ్యాంకులు ఈ లక్ష్యాన్ని అధిగమించాలని ఆశిస్తున్నానంటూ క్రూర పరిహాసాన్ని వ్యక్తం చేశాడు. ఇప్పటికున్న మార్గదర్శకాల ప్రకారం దుర్భిక్ష ప్రాంతాల్లో పంటరుణాలను రీషెడ్యూలు చేయవలసి వుంది. అయినా రిజర్వు బ్యాంకు కిమ్మనకుండా వుంది. పైగా రుణాలమాఫీ వాగ్దానాన్ని రీ షెడ్యూలుకు కుదించిన ఆంధ్ర, తెలంగాణా ప్రభుత్వాలకు ఆర్థికమంత్రి మొండిచెయ్యి చూపించాడు. అక్కడితో ఆగక వ్యవసాయంలో ప్రైవేటు పెట్టుబడి మదుపును పెంచేందుకు వ్యవసాయ రంగానికి దీర్ఘకాలిక రుణాలు (రోడ్లు, గోదాములు, ట్రాక్టర్లు తదితరాలకు) పెంచమని బ్యాంకులను ఆదేశించాడు. అంటే 8 లక్షల కోట్ల రుణాలలో పంటరుణాల వితరణను తగ్గించబోతున్నారు. కరవు కోరలకు రైతాంగాన్ని వదిలివేశాడు.

సాగువర్షాధారస్థితిని మార్చేందుకు సాగునీటికి ఒక్క పైసా అదనంగా కేటాయించని ఆర్థికమంత్రి గంగానది శుద్ధికీ, స్నానఘట్టాల సుందరీకరణకూ 2 వేల కోట్లు కేటాయించాడు. విచిత్రమేమంటే ప్రస్తుత సాగునీటి పథకాలను పూర్తిచేయటం గురించి ఒక్కమాట చెప్పకుండా, సాగునీరు అందుబాటులోకి తెచ్చేందుకు 'ప్రధానమంత్రి కృషి సించయి యోజనా' (సంస్కృతం పేరుతో) కొత్త పథకాన్ని ప్రారంభిస్తానని హామీ యిచ్చారు. అదేవిధంగా ప్రైవేటు మార్కెట్టు యార్డుల ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలకు నిధులు కేటాయించి, ప్రైవేటు వాణిజ్యానికి అనుగుణంగా మార్కెట్టు యార్డు చట్టాలను సవరించమని రాష్ట్రాలను కోరాడు. ప్రభుత్వ మార్కెట్టుయార్డులు గుత్తాధికారంతో వ్యాపారులతో చేతులు కలిపి రైతులను దోపిడీ చేస్తున్నాయన్న కాంగ్రెసు చెప్పిన సాకునే ఈయన చెప్పాడు. ఈ సాకు చాటున చట్టాన్ని అమలుచెయ్యని ప్రభుత్వాల వైఫల్యాన్ని దాచిపెట్ట చూశాడు. పైగా ఈ ప్రైవేటు గుత్తవ్యాపారుల ఆధ్వర్యంలో ఏకీకృత దేశవ్యాపిత మార్కెట్టు ఏర్పడితేతప్ప వ్యవసాయం లాభసాటి కాదంటూ తన అసలు ఉద్దేశ్యాన్ని బయట పెట్టుకున్నాడు.

రైతాంగ మెదుర్కొంటున్న సంక్షోభానికి మూలకారణం వ్యవసాయరంగానికి ప్రభుత్వమివ్వవలసిన మద్దతును పూర్తిగా ఉపసంహరించుకోవడమే. ఎరువులకిస్తున్న సబ్సిడీని గత ఏడాది స్థాయికే, 65 వేల కోట్లకే పరిమితం చేశాడు. సహజవాయువు ధర పెంపును మూడు నెలలు వాయిదా వేశాడు. అంటే ఆ తర్వాత పెంచుతారు. సహజవాయువు ధర యూనిటుకు ఒక డాలరు పెరిగితే యూరియా ధర టన్నుకు 1370 రూ॥లు పెరుగుతుంది. పెంచబోతున్నది నాలుగు డాలర్ల నుండి 8 డాలర్లకు. అంటే టన్నుకు 5480 రూ॥లు పెరుగుతుంది. ఇది ప్రస్తుతానికే. 2015 నాటికి పెంచాల్సింది 12 డాలర్లకు. అలాగే విద్యుత్తు రేటు యూనిటుకు 45 పైసలు పెరుగుతుంది. ఈ పెంచే ధరలకు అనుగుణంగా ఎరువుల సబ్సిడీ పెంచనందున అధికధర భారమంతా రైతాంగంపైనే మోపటానికి ఆర్థికమంత్రి పూనుకున్నాడు.

ఫుడ్ కార్పొరేషన్ రైతుల నుండి నేరుగా ధాన్యం కొనుగోలును పూర్తిగా మానివేస్తుందనీ, రాష్ట్ర ప్రభుత్వాల నుండి సేకరిస్తుందనీ ప్రకటించాడు. రైతాంగానికి కనీస మద్దతుధరన్నా దక్కుతుందన్న ఆశను కొడిగట్టించాడు.

రైతాంగంపట్ల ఆర్థికమంత్రి వైఖరి స్పష్టమైంది. మార్కెటు నియంత్రణ చట్టాలున్నా వాటిని తుంగలోతొక్కి అటు రైతాంగాన్నీ, ఇటు ప్రజలనూ గుత్తవ్యాపారులు నిలువుదోపిడీ చేస్తున్న తీరును గత ఐదేళ్ళుగా ఉల్లి పంటతో చూస్తూనే వున్నాము. ఎఫ్‌సిఐని రంగం నుండి తప్పించి, రైతాంగాన్ని గుత్తవ్యాపారుల ముందు నిస్సహాయులుగా నిలిపి వారే లాభదాయకమైన రేటు ఇస్తారంటూ ఆశలు కల్పిస్తున్నారు. గుత్త వ్యాపారులను బలీయంచేసి, అన్ని సాగు ఉత్పాదకాల రేట్లు పెంచీ రైతాంగాన్ని అడకత్తెరలో పోకచెక్కలా నలిపివేయాలన్న సామ్రాజ్యవాద నిర్దేశిత విధానాన్నే ఈ బడ్జెట్టులో ఆర్థికమంత్రి కొనసాగించాడు.

### ఎండమావిగా ఉపాధి కల్పన

దేశంలో చిన్న పరిశ్రమలు, చిన్న వ్యాపార సంస్థల సంఖ్య 5.7 కోట్లు ఇవి దాదాపు 11 కోట్లమందికి ఉపాధి కల్పిస్తున్నాయి. దాదాపు ఆరులక్షల కోట్ల రూ॥ల సంపదను సృష్టిస్తున్నాయి. (తరువాయి 2వ పేజీలో)

శ్రామికవర్గ పోరాటయోధుడు, మార్క్సిస్టు లెనినిస్టు మేధావి

## కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డికి విప్లవ జోహార్లు



**కామ్రేడ్** టి.ఎన్. రాజీలేని పోరాటయోధుడు. విద్యార్థి దశ నుండి అంతిమ శ్వాస వరకూ ఆయన ఈ దోపిడీ వ్యవస్థపై రాజీలేని పోరాటం చేశాడు. ఎన్నో కష్టనష్టాలను భరించి నిజమైన శ్రామికవర్గ విప్లవకారుడిగా జీవించాడు. పీడిత ప్రజలపై ఈ దోపిడీ వ్యవస్థ సాగించిన ప్రతి దాడినీ ఎదుర్కొన్నాడు. ప్రజల నిత్యజీవిత, ఆర్థిక, రాజకీయ, సాంఘిక సమస్యలకు కారణమైన పాలకవర్గాలపై అత్యంత కరకుగా విరుచుకుపడేవాడు. కమ్యూనిస్టు ఉద్యమంలో తలెత్తిన రివిజనిస్టు విధానాలకూ, అతివాద, మితవాద అవకాశవాదాలకు వ్యతిరేకంగా ఖచ్చితంగా సూత్రబద్ధంగా నిలిచాడు. వీటికి వ్యతిరేకంగా వ్యక్తిగత దూషణలను కూడా లెక్కపెట్టకుండా పోరాటం చివరికంటా నిలబడ్డాడు. ఆయన గొప్ప ప్రచారకుడు, ఆందోళనాకారుడు, సహృదయుడు, స్నేహశీలి. శ్రామికవర్గ విప్లవ దీక్ష మూర్తీభవించిన నాయకుడు.

కా॥టి.ఎన్. వదలివెళ్లిన సుగుణ సంపదలన్నీ భవిష్యత్తు విప్లవతరానివే. వాటికి వారసులు వారే. త్యాగము, దీక్ష, క్రమశిక్షణ, నిరంతర శ్రమ, అధ్యయనం, స్పందన, పోరాటతత్వం మొదలైన కా॥టి.ఎన్ ఉత్తమ లక్షణాలను స్వీకరించి వాటిని ఆకళింపుచేసుకుని ఆయన ఆశయాన్ని సాధించేందుకు పునరంకితమౌదాం.

కా॥ టి.ఎన్. మనలను వీడిపోయి 38 ఏళ్లు గడచింది. 'కొండల అవతలనుండి భావాలు రావటాన్ని ఆపలేరు. కానీ కొండల అవతలనుండి ఆజ్ఞలు జారీకావటమే దేశానికి ప్రమాదకరమ'ని కా॥ టి.ఎన్. శాసనసభలో పేర్కొన్న-హెచ్చరికలోని వాస్తవాన్ని గత మూడు దశాబ్దాలపైగా చరిత్ర నిరూపించింది. ఆయన చెప్పిన ప్రపంచబ్యాంకు యిష్టం ప్రకారం బడ్జెట్టును రూపొందించే స్థితి, ఈనాడు ప్రపంచబ్యాంకే బడ్జెట్టును తయారుచేయించి యిచ్చే స్థితికి దిగజారింది. 'ఇక్కడ ఫ్యాక్టరీలు కట్టాము, ఉత్పత్తి సాగుతున్నదంటే, అవి మనవైపోతాయా? వాటిలోని నిబంధనలతో విదేశీ పెట్టుబడి చెప్పినట్లు వినేవారికి లాభాలు కట్టబెట్టేవికావా?' అని ఆయన ఎత్తిచూపిన పరిస్థితి ఈనాడు ప్రభుత్వ సంస్థలతోపాటు అన్ని పరిశ్రమలను వారికి ధారాదత్తం చేసిన స్థితికి దిగజారింది. కేంద్రప్రభుత్వం చేసిన అప్పులకు విదేశాలకు 500 కోట్లు చెల్లించటాన్ని ఆయన పేర్కొని ఇక తెలంగాణాకు ఏదైనా చెయ్యటానికో, ఒక ఫ్యాక్టరీ పెట్టడానికో చేతిలో చిల్లిగవ్వలేని స్థితిని ఆయన ఎత్తిచూపగా, ఈనాడు 4,27,000 కోట్లు వడ్డీల చెల్లింపులకే, అంటే దాదాపు దేశ ప్రజలనుండి పన్ను వసూలు ఆదాయమంతా చెల్లించే స్థితికి దిగజారింది. అందువల్ల మనం అసెంబ్లీలోకి వస్తుంటే జీతాలు కావాలని నిరాహారదీక్ష సమ్మెలు చేస్తున్న వారిపై నిర్బంధ చర్యలు తీసుకోవటం తప్ప మనకు వారి సమస్యలు తీర్చే విధానం లేకపోయిందన్న ఆనాటి టి.ఎన్ ఎత్తిచూపిన పాలకుల రాజకీయ దివాళాకోరుతనం ఈనాడు పరాకాష్టకు చేరి సమ్మెలను, ధర్నాలనూ చట్టవ్యతిరేక చర్యలుగా ప్రకటించటానికి చేరింది. సైనికరంగంలో పెరుగుతున్న పరాధీనత దేశరక్షణకే ప్రమాదకరం కాబోతున్నదని ఆనాడు ఆయన చేసిన హెచ్చరిక నేడు నిజమైకూర్చుంది. తుపాకులూ, వాటికి తూటాలనుండి యుద్ధ విమానాల వరకూ సామ్రాజ్యవాదులు దయదలిచి యిస్తే తప్ప సైన్యం పోరాడలేని స్థితికి చేరింది. అంతేకాదు, హిందూమహాసముద్రంలో అమెరికా వాణిజ్య నౌకల రక్షణకు భారత నావికాసైన్యం కాపలాగా వుండే స్థితికి దిగజార్చారు. ఇక ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్ వంటి దేశాలనుండి అమెరికా సైన్యాన్ని తప్పిస్తే, ఆ ప్రజల ఆగ్రహానికి భారత సైనికులను బలిపెట్టేందుకు భారత పాలకులు ఉవ్విళ్ళూరుతున్నారు. టి.ఎన్. పేర్కొన్న సర్వసంపదలు తాకట్టుపెట్టే స్థితినుండి అమ్మివేస్తున్న దుస్థితికి దేశాన్ని పాలకులు దిగజార్చారు.

ఈ పరిస్థితి - దేశానికీ, దేశప్రజలకూ నిజమైన సర్వతోముఖాభివృద్ధి సాధించబడాలంటే నూతన ప్రజాస్వామిక విప్లవమే శరణ్యమని చాటుతున్నది. ఇది విప్లవకారులపై గురుతర బాధ్యతనుంచుతున్నది. సూత్రబద్ధ సిద్ధాంత - రాజకీయ చర్చ సాగించి, విప్లవకారులు ఐక్యమై కమ్యూనిస్టు పార్టీని నిర్మించాలి. పట్టువిడుపులుగల ఎత్తుగడలతో, రైతాంగ సాయుధపోరాటం ప్రధాన పోరాటంగా, వివిధ పోరాట రూపాలను అనుసరిస్తూ భారత జనతా ప్రజాతంత్ర విప్లవాన్ని వారు విజయంవైపుగా పురోగమింపచేయాలి. అదే కా॥టి.ఎన్. తదితర విప్లవ నాయకులకు నిజమైన నివాళి అవుతుంది.

విప్లవ విజయం తథ్యం అన్న ఆయన చూపిన దృఢవిశ్వాసాన్ని సాకారం చేసేందుకు పునరంకితమౌదాం.

## కేంద్ర ప్రభుత్వ... (మొదటిపేజీ తరువాయి)

వాటి సగటు పెట్టుబడి మదుపు యూనిటుకు 2 లక్షలు. కాగా వాటి సగటు అదనపు సంపద సృష్టి యూనిటుకు లక్ష రూ॥లు. వీటిలో నాల్గవ వంతు వస్తుతయారీ రంగంలో వున్నాయి. వస్తూత్పత్తుల ఎగుమతులలో వీటిదే సింహభాగం. కాగా వీటిలో ప్రతిఏడూ 80 వేల యూనిట్లు నష్టాలపాలై మూతపడుతున్నాయి. వీటి ప్రధాన సమస్య రుణపరపతి సౌకర్యం. వీటి సమస్యల పట్ల పాలకులు పూర్తి నిర్దాక్షిణ్యంగా వ్యవహరించారు. హైద్రాబాదులో కరెంటు కోతతో ఇవి మూతపడితే అప్పుల చెల్లింపు కోసం బ్యాంకులు వీరిని వేధించిన తీరే దీనికుదాహరణ.

ఈ చిన్న పరిశ్రమలు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అన్న ఆర్థికమంత్రి వీటికి ఆర్థిక సహాయ మందించే నిర్దిష్ట సూచనలు చేసేందుకు ఒక కమిటీని నియమిస్తున్నట్లు బడ్జెట్టులో ప్రకటించాడు. ఇప్పటికే వీటికి బ్యాంకు రుణాలను ప్రాధాన్యత రంగంగా నిర్దేశించారు. స్మాల్ ఇండస్ట్రీస్ డెవలెప్‌మెంటు బ్యాంకు ఆఫ్ ఇండియా దశాబ్దంపైగా పనిచేస్తున్నది. వీటికి సహాయమెలా అందించాలో తెలియనంత అమాయకత్వాన్ని నమ్మగలమా? వీటికి కేటాయించిన వస్తూత్పత్తులను రిజర్వేషను లిస్టు నుండి ఒక్కొక్కటిగా తొలగిస్తూ బడా బూర్జువాల పరం చేస్తున్నారు. బడాబూర్జువాల ధనబలం ఎదుర్కోలేక కునారిల్లుతున్న చిన్నపరిశ్రమలకు ఇలాంటి ఆశలు గొలిపే ప్రకటనలతో గత ప్రభుత్వాలు కాలం వెళ్ళబుచ్చిన తీరునే నేటి ఆర్థికమంత్రి పుణికి పుచ్చుకున్నాడు. కనుక ప్రధాన వ్యవసాయేతర ఉపాధిరంగంగా వున్న చిన్నపరిశ్రమలు, సంస్థల్లో ఉపాధి కల్పన మెరుగుపరిచే చర్యలేవీ బడ్జెట్టులో లేవు.

బడా బూర్జువాలూ, సామ్రాజ్యవాదుల ఆధీనంలో వున్న సంఘటితరంగం 1.7 కోట్లమందికి మాత్రమే ఉపాధి కల్పిస్తున్నది. మొత్తం ఉపాధి కల్పనలో పెద్ద పరిశ్రమలు, సంఘటితరంగం వాటా 10 శాతం మాత్రమే వుండగా, ఆర్థిక సంస్కరణల తర్వాత తగ్గిపోతూ గతఏడు 7 శాతంగా వుంది. ఈరంగానికి లక్షల కోట్ల రాయితీలు కల్పించినా, ఉపాధికల్పన తరిగిపోయింది. కాగా ఆర్థికమంత్రి ఈ రంగానికే వరాల వాన కురిపించి ఉపాధి కల్పన మెరుగుపడదన్న వాస్తవాన్ని కప్పి పుచ్చేందుకు ఇవి యిముడ్చుకోగల నైపుణ్యం యువతకు లేకపోవటాన్ని సాకుగా చూపాడు. త్వరలోనే నైపుణ్య భారత్ పథకాన్ని ప్రారంభిస్తానని ప్రకటించాడు. అయితే దానికి పైసా కూడా కేటాయించలేదు. ఇంతకీ ఈ పథకం క్రింద యువతకు నేర్పే నైపుణ్యాలేమిటి? ఉద్యోగాలుపొందగల నైపుణ్యాలు (దీని అర్థమేమి భగవాన్?) ఒక సంస్థను స్థాపించగల నైపుణ్యాల (చిన్న పరిశ్రమ కష్టాలు మళ్ళీ చెప్పాలా?)తో పాటుగా వడ్రంగం, చెప్పులు కుట్టడం, కట్టుడు మేస్త్రీ, కమ్మరం, నేత తదితర సాంప్రదాయక వృత్తి నైపుణ్యాలూ నేర్పుతారట. (పల్లె కన్నీరెడుతోంది... అన్న పాట గుర్తుందా) దీని కోసం ఇప్పటికే ఉన్న పథకాలన్నీ ఒకే పథకంగా రూపొందిస్తారట. ఉపాధి లేమికి నెపాన్ని యువతపైకి నెట్టి వారిని ఉద్ధరించే అవతారందాల్చే వంచన తప్ప ఇది మరేమీ కాబోదు.

ఇక అరుణ్ జైట్లీగారి బడ్జెట్టులో ఉపాధి కల్పన అవకాశం ఒక్కటే కన్పిస్తున్నది. 100 సుందర నగరాల నిర్మాణం, రోడ్లు, విమానాశ్రయాలు, ఓడరేవుల నిర్మాణం. ఇక్కడ దొరికే ఉద్యోగాలు కూలి పనులే. వీటి నిర్మాణం పూర్తయిన తర్వాత ఈ 'అలగా జనం' ఈ సుందర నగరాలలో ఏ టీకొట్టు పెట్టుకునో (నరేంద్రమోడి ఇదే చేసాడన్న ప్రచారాన్ని నమ్మితే) బ్రతికేందుకు వీలులేకుండా తరిమివేస్తారు. వీటి నిర్మాణానికి బడ్జెట్టుకు ముందే సింగపూర్ కంపెనీలను రమ్మని మోడీ ఆహ్వానించారు. శ్రమ మనది; ధనం మనది; ఏర్పడిన సౌకర్యాలూ లాభాలూ మాత్రం విదేశాలవి.

## త్రిశంకు స్వర్గం

నరేంద్రమోడీ నయా మధ్యతరగతి నొకదాన్ని గుర్తించాడు. దానిని ఆకర్షించే ఎన్నికల నినాదాలను రూపొందించాడు. ఐటి రంగంలో ప్రైవేటు రంగంలో అధిక వేతనాలు పొందుతున్నవారూ, పే కమీషన్లతో విపరీతంగా పెంచిన వేతనాలు పొందుతున్న ప్రభుత్వ ఉన్నతోద్యోగులను ఆయన నయా మధ్యతరగతిగా నిర్వచించాడు. ఆర్థికమంత్రి తన బడ్జెట్టులో ఈ నయా మధ్యతరగతి అన్నదానిని ఉబ్బితబ్బిబ్బు చేసేందుకు పూనుకున్నాడు. వీరికి ఆదాయపు పన్నులో రాయితీ లిచ్చాడు. వీరి పొదుపు సొమ్ముపై పన్ను తగ్గించాడు. పబ్లిక్ ప్రావిడెంట్ ఫండులో వీరి మదుపుపై పన్ను రాయితీ యిచ్చాడు. వీరిలో కొంత ఎక్కువ ఆదాయం వున్నవారికి గృహరుణాలకు చెల్లించే వడ్డీపై పన్నును తొలగించాడు. ఈవిధంగా ఈ "నయా మధ్యతరగతి" చేతిలో ఎక్కువ సొమ్ము ఉండేవిధంగా చేయగలిగానన్న ఆర్థికమంత్రి వారికి యింకా ఎక్కువ సొమ్ము మిగిలే విధంగా చేయటానికి (మరిన్ని పన్ను రాయితీలు) తన వద్ద తగిన నిధులు లేకుండాపోయాయని వాపోయాడు.

ఇంతకీ వారి చేతిలో ఈ సొమ్ము ఎందుకు మిగిల్చినట్లు? ఇంకోచేతితో లాగివేసుకోవటానికి! భారత పారిశ్రామిక రంగంలో ప్రజల అవసరాలను తీర్చగల వస్తూత్పత్తిరంగం కునారిల్లుతుండగా, ధనాఢ్యవర్గాల విలాసాలను తీర్చే సరుకుల పరిశ్రమలు లాభాలు గడిస్తున్నాయి. ప్లాస్మా టివిలు, స్మార్ట్‌ఫోన్‌లు, మోటారు వాహనాలూ ఇలాంటివే. ఈ పరిశ్రమలకు ఎన్ని రాయితీలిచ్చినా వీటి అమ్మకాలు స్థంభించి పోతున్నాయి. ఈ నయా మధ్యతరగతి అన్నదానితో వీటిని కొనిపించేందుకే వారి చేతిలో ఎక్కువ సొమ్ము మిగిలేవిధంగా చేశాడు. ఈవర్గం విలాస సరుకులు కొని ఉబ్బిపోవచ్చు కానీ, వాటి వినియోగంతో పెరిగే ఖర్చులతో మిగులు హుళ్ళక్కి. వారి జీవనం మిగిలిన మధ్యతరగతుల్లా త్రిశంకు స్వర్గమే.

ఈ నయా మధ్యతరగతి అన్నది భారత ఆర్థిక వ్యవస్థకు బలం కాదు; వాపు మాత్రమే (ఇంతకీ ఐ.టి. రంగం గత 20 ఏళ్ళలో కల్పించిన ఉద్యోగాలు 36 లక్షలే) 2008లో సామ్రాజ్యవాద వ్యవస్థ లోనైన ఆర్థిక సంక్షోభంతో వీరి జీవన పరిస్థితి తల్లక్రిందులైన అనుభవం ఉంది. సామ్రాజ్యవాదులు సంక్షోభం నుండి కొంత కోలుకోవటంతో వీరి ఆదాయ అవకాశాలు మళ్ళీ పెరిగాయి. విదేశాలపై ఆధారపడిన ఈ రంగంపై ఆశలు పెట్టుకుని ఆర్థిక వృద్ధిని సాధించాలన్న ఆర్థికమంత్రిగారి పథకం ఈ పరాధీనతను మరింత పెంచుతుందే తప్ప దేశ ఆర్థిక వ్యవస్థను స్వంతకాళ్ళపై నిలపలేదు.

## విదేశీ పెట్టుబడి ముందు మోకాలిదండ

అలా స్వంత కాళ్ళపై నిలపాలని భారత పాలక వర్గాలూ కోరుకోవటం లేదు. విదేశీ పెట్టుబడులకు దేశ ఆర్థికాన్ని పాదాక్రాంతం చేసేందుకు వారు ఉవ్విళ్ళూరుతున్నారు. సామ్రాజ్యవాదుల ఆజ్ఞలను తూచా తప్పక పాటిస్తున్నారు. దీనిలో బిజెపి, కాంగ్రెసు అడుగుజాడలలోనే నడుస్తున్నా మరింత బరితెగించి వ్యవహరిస్తున్నది. సైనిక ఉత్పత్తుల రంగంలోకి విదేశీ పెట్టుబడులకు గేట్లు తెరిచారు. దీనితో ఆయుధాలలో స్వావలంబన సాధించటంతోపాటుగా, కొత్త పరిశ్రమల్లో ఉపాధి పెరుగుతుందని చెప్పారు. విదేశీ పెట్టుబడి వున్నా భారత మేనేజిమెంట్ ఉంటుందని అవి మన అధీనంలోనే ఉంటాయనీ వాదించారు. ఈ బడ్జెట్టు ప్రతిపాదనలు ఆచరణలోకొచ్చేటప్పటికి రూపొందే నిబంధనలు వీటిని వట్టిమాటలుగానే మిగుల్చుతాయి. విదేశీ ఆయుధ కంపెనీలు తమ అనుబంధ కంపెనీలను కూడా భారత కంపెనీలుగా గుర్తించమని డిమాండు చేస్తున్నాయి. దీనికంగీకరిస్తే తప్ప అవి పెట్టుబడి పెట్టవు. అంగీకరిస్తే అవి పెట్టే కంపెనీలు విదేశాల్లో తయారైన ఆయుధాలు అమ్మే వ్యాపార కంపెనీలుగానే మిగులుతాయి.

ఇక విదేశీ పెట్టుబడి ఎంతశాతమన్న చర్చ అర్థరహితం. బీమారంగంలో 26 శాతం విదేశీ పెట్టుబడి ఆమోదించారు. అయినా ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్‌లో విదేశీ పెట్టుబడికి యాజమాన్య నిర్ణయాలను వీటో చేసే అధికారాలుంచుకుని తిరుగు లేని పెత్తనం సాగిస్తున్నది. బీమారంగంలోనూ, సైనిక రంగంలోనూ విదేశీ పెట్టుబడి 49 శాతానికి పెంచటం భారత అదుపు ఉంటుందన్నది పగటి కల. అవి విదేశీ అధీనంలోనే వుంటాయి. భారతీయుల పొదుపు సొమ్మైన బీమా నిధులు ప్రవాహంలా విదేశాలకు తరలిపోతాయి.

విదేశీ పెట్టుబడికి గేట్లు తెరవటం ఇక్కడితో ఆగలేదు. ప్రజల జీతాల నుండి బిగబట్టిన పెన్షన్ నిధులనూ వారి పరం చేశారు. రియల్ ఎస్టేటు రంగంలో విదేశీపెట్టుబడికి నిబంధనలను సడలించారు. విదేశీ ద్రవ్య పెట్టుబడిదారులు దేశంలో సాగించే కార్యకలాపాలతో వచ్చిన వాణిజ్య ఆదాయాన్ని పెట్టుబడి వృద్ధిగా పరిగణిస్తారు. అంటే పన్ను మినహాయింపు యిస్తారు. నోకియా, వొడాఫోన్‌ల పన్ను ఎగవేత అక్రమాన్ని చట్టబద్ధం చేసేందుకు ముందు ఏడాదులకు (రిట్రోస్పెక్టివ్) పన్ను విధానాన్ని అమలుచేయటంలో మరింత జాగ్రత్త వహిస్తామని (అర్థం పట్టించుకోమని) హామీనిచ్చారు.

ఇక బడా బూర్జువా వర్గానికి పన్ను రాయితీలు కొనసాగిస్తూ వాటిని ఎక్కువ చేశారు. యుపిఏ ప్రభుత్వం ఏడాదికి ఐదు లక్షల కోట్ల రూపాయల పన్ను రాయితీలివ్వగా, వాటిని మరో లక్ష కోట్ల వరకూ బిజెపి పెంచింది. ఇక ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం పేరిట ప్రజాధనాన్ని ప్రైవేటు శక్తుల లాభార్జనకు లోబరిచింది. విద్యుత్తు, రియల్ ఎస్టేటు, రోడ్లు, సుందర నగరాలకు పన్ను మినహాయింపులిచ్చింది.

ఇక్కడ ప్రభుత్వ అవగాహన స్పష్టమే. విదేశీ, దేశీయ ప్రైవేటు పెట్టుబడి ఆధ్వర్యంలో వృద్ధి సాధించాలి. కనుక ఈ ప్రైవేటు పెట్టుబడి మదుపును ప్రోత్సహించే చర్యలు తీసుకోవాలి. వృద్ధిలో ప్రభుత్వ పాత్రను తగ్గించుకోవాలి. ఇది ప్రపంచబ్యాంకు సూచించిన మార్గం. దీనినే గత యుపిఏ, నేటి బిజెపి అనుసరిస్తున్నాయి. ఈ పద్ధతిలో వృద్ధి సాధించిన ఉదంతాలు గతంలో ఏనాడూ లేవు. ఇదొక ఊహాకల్పిత ప్రతిపాదన మాత్రమే. దీనినే నిరూపించిన ఆర్థిక సిద్ధాంతంగా భారత పాలకులు తలకెత్తుకున్నారు.

## దివాళా ఆర్థికం

గత పాతికేళ్ళుగా అమలుజరుపుతున్న ఈ విధానం భారత ఆర్థిక వ్యవస్థను ఎక్కడకు చేర్చిందో ఈ బడ్జెట్టులోని గణాంకాలే తెలుపుతున్నాయి. గత ఏడాది సవరించిన బడ్జెట్టు అంచనాల ప్రకారం ప్రభుత్వ రెవిన్యూ ఆదాయం 10 లక్షల కోట్లకు కొంత ఎక్కువగా వుండగా, చేసిన అప్పులకు చెల్లించిన వడ్డీలు 3.8 లక్షల కోట్లు వున్నాయి. దాదాపు 36 శాతం. మిగిలినది జీతనాతాలకు పోగా రెవిన్యూ లోటు 3.9 లక్షల కోట్లు అయింది. ఇక ఏ పని చెయ్యాలన్నా మళ్లీ అప్పు చెయ్యటమే. ఇలా అప్పుల ఊబిలో పీకలోతున మునిగిపోయింది.

ఇక అప్పులు బిగబట్టిన సామ్రాజ్యవాదం ప్రభుత్వ ఆస్తులు అమ్ముకొని లోటు తీర్చుకోమని సలహా యిచ్చింది. దీనితో ప్రభుత్వరంగ సంస్థలు, ప్రత్యేకించి బ్యాంకులలో ప్రభుత్వ వాటాలను అమ్మివేస్తానని ఆర్థిక మంత్రి ప్రకటించారు. దీని ద్వారా మిగిలిన 8 నెలల్లో 63 వేల కోట్ల రూ॥ల ఆదాయం వస్తుందని లెక్క చూపాడు. ఇది భారత ప్రభుత్వ ఆర్థిక దుస్థితికి అద్దం పడుతుంది.

ఇక లెక్కల కరారుతో ఆర్థిక వ్యవస్థ ఆరోగ్యంగా వున్నట్లుగా చూపేందుకు పూనుకున్నాడు. ప్రపంచ బ్యాంకు నిర్దేశం ప్రకారం ద్రవ్యలోటును 5 శాతానికి లోపుగా చూపాలంటే ప్రభుత్వ ఆస్తులు అమ్మినా లోటు పూడలేదు. దీనితో పన్నేతర రెవిన్యూ ఆదాయం 6.7 శాతం పెరగబోతున్నట్లుగా చూపాడు. ఎలా చూపాడు? రిజర్వు బ్యాంకు భారత ప్రభుత్వానికి రికార్డు స్థాయిలో 46 వేల కోట్లు డివిడెండు చెల్లించబోతున్నట్లు చూపాడు. ఇది కాక భారత పబ్లిక్ అకౌంటులో ఖర్చుకాకుండా మిగిలిన 12 వేల కోట్ల రూ॥లను ఈ పద్దు క్రింద చూపాడు. ఇలా చేయటం ఇదే మొదటిసారి. ఇవి రెండూ పూర్తిగా అమలవుతాయని అనుకున్నా, ఈ ఒక్కసారి జరిగే బదలాయింపు ఈ ఏడాదికి సరిపెడితే, వచ్చే ఏడాది లోటునెలా పూరించుకుంటారు. వాస్తవమేమంటే రిజర్వుబ్యాంకు డివిడెండు చెల్లింపుగానీ, ప్రభుత్వ ఆస్తుల అమ్మకంగానీ, పబ్లిక్ అకౌంటు నుండి తరలింపుగానీ, ఆర్థికమంత్రిగారు చూపిన గణాంకాలన్నీ అవాస్తవమైనవే. చూపిన మేరకు ఈ ఆదాయం రాదన్నది స్పష్టం.

దీనితో పరోక్ష పన్నులను, ప్రధానంగా ఎక్సైజ్ పన్నును, కనిపించకుండా పెంచే పనిచేశాడు. పరోక్ష పన్నుల విధింపులో వివక్ష ఉండరాదన్న సూత్రాన్ని పాటిస్తున్నామంటూ గొప్పలు చెప్పుకొంటూ కొన్నింటిని తగ్గించీ, కొన్నింటిని పెంచీ చెప్పకుండానే ప్రజలపై పన్నుల భారాన్ని పెంచాడు.

అయినా లోటు పూడదు. బడ్జెట్టులో భారాలు మోపరు. బడ్జెట్టుకు ముందూ, ఆ తర్వాత ఆ పని చేయటాన్ని ఇప్పుడు ఆనవాయితీ చేశారు. ఒకసారి బడ్జెట్టులో పన్నులు వేసిన తర్వాత మళ్ళీ బడ్జెట్టు వరకూ దాని జోలికెళ్ళని గత విధానాన్ని మార్చారు. పరిస్థితి బట్టి భవిష్యత్తులో పన్ను శాతాలను మార్చే విధానం చేపడతారు. వారం రోజుల్లో రైల్వేబడ్జెట్టు ప్రవేశ పెట్టబోతూ రైల్వేఛార్జీలు పెంచటం దీనిలో భాగమే. ఇంతేకాక రైల్వేలు వాడుతున్న ఇంధనం (విద్యుత్తు, డీజిలు) ధరలు పెరిగినప్పుడు, ఆ మేరకు అధికారులే ఛార్జీలు పెంచే (ఇంధన ఛార్జీల సర్దుబాటు అన్న పేరిట) విధానాన్ని సూత్ర ప్రాయంగా ఆమోదించారు. సహజవాయువు ధరను నాలుగు డాలర్ల నుండి 8 డాలర్లకు వచ్చే ఏడు 12 డాలర్లకూ పెంచాలన్న నిర్ణయాన్ని మూడు నెలలు వాయిదా వేసి బడ్జెట్టు పరిధిలోకి రాకుండా చేశారు. మూడు నెలల తర్వాత పెంచుతారన్నది స్పష్టమే. గ్యాసు ధర ఒక డాలరు పెరిగితే విద్యుత్తు ధర యూనిటుకు 45 పైసలు పెరుగుతుంది. ఇక డీజిలు ధరలు నెలకు 50 పైసలు లెక్కన పెంచుతారు. పెరిగిన ధరపై మళ్ళీ పన్ను పెరుగుతుంది. ఈవిధంగా బడ్జెట్టులో ప్రజలపై భారం మోపినట్లు చూపకుండానే, భారాలను మోపారు.

లోటు పూరించే చర్యలలో భాగంగా ఆర్థిక మంత్రి కిసాన్ వికాస్ పత్ర అన్న మదుపు పథకాన్ని తిరిగి రంగం మీదకు తెచ్చారు. దీనిని కాంగ్రెసు ప్రభుత్వం ప్రవేశపెట్టింది. 100 నుండి 50,000 రూ॥ల వరకూ విలువున్న పత్రాలను పోస్టాఫీసుల నుండి కొనవచ్చు. అంతేకాక ఒకరు ఎన్ని పత్రాలైనా కొనవచ్చు. 8 ఏళ్ళ తర్వాత ప్రభుత్వం రెట్టింపు సొమ్ము చెల్లిస్తుంది. ఈ పథకం నల్లధనాన్ని దాచుకునే సాధనమైందని విమర్శలు రావటంతో కాంగ్రెసు ప్రభుత్వం ఆపివేసింది. నల్లధనాన్ని వెలికి తీస్తానని బీరాలు పలికిన బిజెపి, దానికోసం అధికారంలోకి రాగానే ఒక కమిటీని వేసిన బిజెపి, నల్లధనాన్ని చట్టబద్ధం చేసే పథకాన్ని ప్రవేశ పెట్టింది. చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకున్నది! నల్లధనాన్ని బయటకు తెస్తానన్నది తప్ప ఏవిధంగానో చెప్పలేదు కదా!

## అణచివేత – ఆశల పందిళ్ళు

దివాళా స్థితిలో వున్న భారత ఆర్థిక వ్యవస్థ భారాన్నంతా ప్రజల వీపులపై మోపుతున్న భారత పాలకవర్గాలకు ఈ విధానం వల్ల ప్రజలలో అసంతృప్తి, అశాంతి పెరుగుతాయని తెలుసు. అవి తమ దోపిడీ పాలనకు వ్యతిరేకంగా ఈ అశాంతి సంఘటిత పోరాటాల రూపం దాల్చకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సంఘటితపడిన ప్రజలను అణచి వేయటానికి నిర్బంధ యంత్రాంగాన్ని పెంచుతున్నారు. ప్రజలు సంఘటితపడకుండా ఒకవైపున వివిధ ప్రజాకర్షక పథకాలతో ప్రజలలో భ్రమలు కల్పిస్తూ, మరోవైపున కుల, మత, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టి ప్రజలను చీల్చివేస్తున్నారు. అరుణ్ జైట్లీ బడ్జెట్టు ఈ విధానాన్నే ప్రతిబింబించింది.

అతివాదాన్ని అణచివేయటానికి రాష్ట్రాలకు సహాయంపేరిట, సముద్ర తీర పోలీసుస్టేషన్ల నిర్మాణం పేరిట, సరిహద్దులలో రోడ్ల నిర్మాణం పేరిట, ఆంతరంగిక భద్రత కాపాడటం కోసమంటూ 6390 కోట్ల రూ॥ అదనంగా కేటాయించాడు. దేశీయాంగ శాఖకు కేటాయించిన దాదాపు 50 వేల కోట్లకూ ఇది అదనం. ఇక సైనిక రంగానికి పెడుతున్న ఖర్చు దాదాపు 3 లక్షలకోట్లు. ఈ బడ్జెట్టులో 12 శాతం పెరిగి, కేంద్ర ప్రణాళికా వ్యయంతో దాదాపు సమానమైంది. నిర్బంధ యంత్రాంగం కోరలకు పదునెక్కించే చర్యలివి.

ఇక కేంద్ర నిధులతో నడుస్తున్న 126 ప్రజాకర్షక పథకాలనూ 66కు తగ్గించారు. ఇన్నాళ్ళూ ఈ పథకాలన్నింటికీ నెహ్రూ కుటుంబ వారసుల పేర్లుండేవి. ఇప్పుడు బిజెపి నాయకుల పేర్లతో కొత్తరూపం దాల్చాయి.

ఈ కుదించిన పాత పథకాలన్నింటికీ గత ప్రభుత్వం కేటాయించిన మొత్తాన్నే కొంత అటూ ఇటూగా కొత్త ఆర్థికమంత్రి కేటాయించారు. వీటితోపాటు మరెన్నో కొత్త పథకాలను కూడా ప్రకటించారు. అవినీతిమయమై, నిర్దేశించుకున్న వందరోజుల పనిదినాలలో 50 రోజుల పని కూడా చూపలేకపోయిన గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ పనులతో అనుసంధానం చేస్తానని ప్రకటించారు. ఆచరణలోకి వచ్చేటప్పటికి రూపొందే విధి విధానాలతో, ఇలా చేయాలని కోరిన ధనిక రైతుల సంగతెలా వున్నా, పేద మధ్యతరగతి రైతాంగానికి తిప్పలు తప్పవు.

ఈ పథకాల ప్రకటనలే తప్ప చెప్పిన మేరకైనా వీటిని అమలు జరపబోరన్నది స్పష్టమే. స్వచ్ఛభారత్ అభియాన్, శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అర్బన్ మిషన్, దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామజ్యోతి యోజనా, ఈ సంస్కృత, ఆర్ ఎస్ ఎస్ పేర్ల జాబితా తరగదు. వీటన్నింటికీ కలిపి కేటాయించింది 100 నుండి 300 కోట్లు. నిజాయితీగా అమలుజరిపితే కావాల్సింది 10 వేల కోట్లు. ఇది చాలు దోసిళ్ళతో తీసి, వేళ్ళ సందుల నుండి కారిపోగా మిగిలిన నీటి చుక్కలనే ఎండిన గొంతులలో పోసి ఉద్ధారకులుగా పోజు పెడతారని చెప్పడానికి. కాగా సర్దార్ పటేల్ ఇనుప విగ్రహానికి కేటాయించింది 200 కోట్లు.

ఆర్‌ఎస్‌ఎస్ హిందూత్వ అజెండాను గత ఎన్‌డిఏ ప్రభుత్వం విద్యా, సాంస్కృతిక రంగాల అమలుతో ప్రారంభించింది. ఇప్పుడు అదే తీరులో భారత చరిత్ర పరిశోధనా సంస్థకు ఆర్‌ఎస్‌ఎస్ భావాలతో ఏకీభవించే వ్యక్తిని నియమించింది. ఇద్దరు వ్యక్తులు ప్రైవేటుగా కలుసుకుంటే దానినొక మత సమస్యగా చేసి గగ్గోలు చెయ్యటం, ఏకీకృత పౌరస్మృతి, ఆర్టికల్ 370లను రంగం మీదకు తేవటం మతపర ఉద్రిక్తతలను ఆరకుండా చూసే, ప్రజలను చీల్చే పాలకవర్గాల కుట్రలో భాగమే.

బడా బూర్జువా వర్గానికీ, విదేశీ పెట్టుబడికీ రాయితీల జల్లు కురిపించిన బడ్జెట్టు ఇది. దేశ ద్రవ్య రంగాన్ని (పెన్షన్‌నిధులు, బ్యాంకు, బీమారంగాల్లో Ô

# సాగునీరు విడుదల కాక, ముందుకు సాగని సేద్యం

ప్రకృతి వైపరీత్యాలు, పాలకుల విధానాల ఫలితంగా దేశంలోనూ, రాష్ట్రంలోనూ అతివృష్టి - అనావృష్టి పరిస్థితి కొనసాగుతున్నది. ఈ సంవత్సరం కూడా అందుకు మినహాయింపు కాకపోగా తీవ్రమైన దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడే పరిస్థితి కన్పిస్తున్నది. గత నాలుగు సంవత్సరాల కాలంలో ఎప్పుడూ లేనంత తక్కువ స్థాయిలో ఇప్పటి వరకు ఈ సంవత్సరం వర్షపాతం తక్కువగా ఉంది. ఈ ఖరీఫ్ సీజన్‌లో జూన్ 21 వరకు సాధారణ వర్షపాతం కంటే దేశవ్యాపితంగా 45 శాతం తక్కువ నమోదైంది.

జూలై 11 నాటికి దేశవ్యాపితంగా 45 శాతం తక్కువ వర్షపాతం నమోదయింది. దక్షిణాది రాష్ట్రాల్లో శీతాకాలంలోనూ వర్షపాతం తక్కువ వున్నందున పరిస్థితి మరింత తీవ్రమైంది. గత మూడు దశాబ్దాల్లో కెల్లా తీవ్రమైన కరువు 2009లో ఏర్పడింది. ఆనాటికన్నా తక్కువ వర్షపాతం నేడు రికార్డు అయింది. రాష్ట్రంలోని రిజర్వాయర్లలో నీరు అడుగంటింది. ఒక దశాబ్దకాలం తర్వాత శ్రీశైలం రిజర్వాయరులోకి జూన్ నెలలో చుక్క నీరు కూడా రాలేదు. అన్ని రిజర్వాయర్లలో సగటున 67 శాతం లోటు వుంది. జూలై నెలాఖరు వరకూ ఋతుపవనాలు బలహీనంగానే వుంటాయని వాతావరణ శాఖ అంచనా.

దేశంలో ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల వలన 70 శాతంగా ఉన్న గ్రామీణ ప్రజల, వారి జీవనాధారమైన వ్యవసాయం తీవ్రంగా నష్టపోవటమే కాకుండా, స్థూల జాతీయ ఉత్పత్తిలో 1.75 శాతం(1.8 లక్షల కోట్లు) నష్టపోయే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీన్ని గమనిస్తే వర్షాభావ పరిస్థితి ప్రమాదం అర్థమౌతుంది.

## తగ్గిన పంటల విస్తీర్ణం

వర్షాభావ పరిస్థితితోపాటు, సాగుకోసం నీటిని విడుదల చేయకపోవటం వలన దేశవ్యాపితంగా పంటల విస్తీర్ణం గణనీయంగా తగ్గే పరిస్థితి కన్పిస్తుంది. గత సంవత్సరం జూన్ 21 నాటికి నమోదైన పంటల సాగు విస్తీర్ణంతో పోలిస్తే ఈ సంవత్సరం 54 శాతం తక్కువగా నమోదైంది.

వరిపంటలో 46 శాతం, పప్పు ధాన్యాల్లో 66 శాతం, నూనెగింజల్లో 10 శాతం మాత్రమే సాగు ప్రారంభమైంది. జూన్ నెలలో నాట్లు పడవలసిన 40 జిల్లాల్లో ఇంతవరకూ నాట్లు పడలేదు. నీరు లేక విద్యుదుత్పత్తి లోటు ఆంధ్రప్రదేశ్‌లో 7 శాతానికి చేరింది. దీనితో బోరుబావుల క్రింద సేద్యం కూడా ప్రశ్నార్థకమైంది.

## రాష్ట్రంలోని పరిస్థితి

ఆంధ్రప్రదేశ్‌లో వర్షాభావ పరిస్థితి తీవ్రంగా ఉంది. ముఖ్యంగా కోస్తా జిల్లాలు ఇందువలన అల్లాడుతున్నాయి. వడగాల్పులతో అల్లాడుతున్న గ్రామీణ ప్రజలు సాగునీరు లేక సేద్యం సాగక తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కాల్వల్లో నీరు పారక పంటకాల్వలు బీటలు వారుతున్నాయి. సాగర్-కృష్ణా బ్యారేజ్‌లో వున్న భూములసాగు ప్రశ్నార్థకంగా వుంది. ప్రకాశం, గుంటూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని 19 లక్షల, కృష్ణాజిల్లాలోని 7.60 లక్షల ఎకరాల్లోని సాగు గురించి రైతుల్లో దిగులు ప్రారంభమైంది. కృష్ణాజిల్లాలో జూన్‌లోనే ప్రారంభం కావాల్సిన సేద్యం, కనీసం నారుమళ్ళకు కూడా నీరు లభించని పరిస్థితుల్లో వున్నారు. ప్రకాశం, గుంటూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని 11.50 లక్షల ఎకరాల్లో జులైలో సేద్యం మొదలు కావాల్సి వున్నా నారుమళ్లు పోవటమే ప్రశ్నార్థకంగా వుంది. మరో 20 రోజుల తర్వాత కూడా పరిస్థితి ఇలాగే వుంటే సేద్యం కష్టమౌతుందని వ్యవసాయా ధికారులు చెబుతున్నారు. వర్షాభావ పరిస్థితులు, ఆధునీకరణ పనుల పేరుతో సాగర్ కుడి, ఎడమ కాల్వలకు నీరు ఎప్పుడు విడుదల చేస్తారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. నెల్లూరు జిల్లాలో నీటి ఎద్దడి మూలంగా దాళ్వా సాగు విస్తీర్ణం కుదించ బడింది. సోమశిల రిజర్వాయర్ పరిధిలోని 70వేల ఎకరాల నాన్‌డెల్టాకు నీరు ఇవ్వలేమని అధికారులు ప్రకటించారు. కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల్లోని 19.33 లక్షల ఎకరాల్లో వర్షాభావ పరిస్థితులవలన లక్ష ఎకరాలకు మించి సాగుకాలేదు. జూన్ 1 నుంచి 18వరకు రాష్ట్రంలో నమోదైన వర్షపాతాన్ని గమనిస్తే, వర్షాభావ పరిస్థితి తీవ్రత అర్థమౌతుంది.

దిగువ పట్టికను పరిశీలిస్తే కోస్తాజిల్లాల్లో 50 నుండి 92 శాతం వరకు తక్కువగా వర్షపాతం నమోదైతే, రాయలసీమలోని కడప, చిత్తూరు జిల్లాల్లో 15 నుండి 28 శాతం వరకు తక్కువగా నమోదుకాగా కర్నూలులో 13, అనంతపురంలో 8 శాతం ఎక్కువ నమోదైంది. జూలై 10 దాటిపోయినా, వర్షం నమోదులో చెప్పుకోదగ్గ మార్పులేదు. గుంటూరు, కృష్ణాజిల్లాల్లో నీరు లేక ఇప్పటికే నారుమళ్ళు పోయలేదు. ఈ పరిస్థితి ఇంకా పదిరోజులపాటు సాగితే మొదటి పంటే కాక రెండవ పంట కూడా ప్రశ్నార్థకమౌతుంది.

## దుర్భిక్షాన్ని ఎదుర్కోవటంలో పాలకుల విఫలత

ప్రతి నాలుగైదు సంవత్సరాలకు దేశంలో, రాష్ట్రంలో దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడుతూనే వున్నాయి. ఈ విషయం పాలకులకు తెలిసి కూడా దాన్ని ఎదుర్కోవటానికి నిర్దిష్టమైన విధానాలు చేపట్టంలేదు. దీన్ని విస్మరించిన పాలకులు దుర్భిక్షానికి కారణమంతా ప్రకృతిపై నెడుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలను ఎలా నివారించగలుగుతామని ప్రజలనే ప్రశ్నిస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలను పూర్తిగా నివారించటం సాధ్యం కాకపోయినా, సరైన విధానాలు అమలు జరిపితే చాలా వరకు వాటి నష్టాలను తగ్గించవచ్చు, సమర్థవంతంగా ఎదుర్కోవచ్చు. పాలకులకు లోపించింది అలాంటి విధానాలు లేకపోవటమే. దేశంలో అపారమైన నదీ జలాలు, భూగర్భజలాలు, పుష్కలంగా లభించే వర్షపు నీరు వుంది. ఈ నీటిని ఉపయోగించుకోగలిగితే, అందుకోసం వివిధ రూపాల్లో ప్రాజెక్టులు నిర్మించి నీటిని నిల్వచేయగలిగితే వర్షాభావాన్ని ఎదుర్కోవటమే కాకుండా సేద్యానికి నీటిని అందించవచ్చు. పాలకులు అలాంటి విధానాలు అమలు జరపకపోవటంవలన వేల టి.యం.సిల నీరు వృధాగా సముద్రంలో కలసి పోతున్నది. వర్షాభావ పరిస్థితులను తట్టుకొనే వంగడాలను రైతులకు అందిస్తే తక్కువ నీటి వినియోగంతో పంటలు పండించగలుగుతారు. సేద్యం కుంటుపడే పరిస్థితి వుండదు.

సేద్యానికి నీరు ఇవ్వని పాలకులు బహుళజాతి సంస్థల నీటి వ్యాపారానికి, జలవిద్యుత్ ప్రాజెక్టులకు మాత్రం పెద్దఎత్తున మళ్లిస్తున్నారు. తద్వారా బహుళజాతి సంస్థల నీటి వ్యాపార దోపిడీయే ముఖ్యమని వారు భావిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో నీటి వనరులకు కొదవలేదు. గోదావరి, కృష్ణా, పెన్నా, వంశధారలాంటి అనేక జీవనదులతోపాటు ఉపనదులు, వాగులు, గెడ్డలు, చెరువులవంటి అపారమైన నీటి వనరులు వున్నాయి. అంతేకాకుండా విస్తారంగా భూగర్భజలాలు వున్నాయి. ఇవికాక పుష్కలంగా వర్షపునీరు లభిస్తుంది. ఇన్ని జలవనరులున్నా రాష్ట్రంలోని అనేక ప్రాంతాలు నేటికీ దుర్భిక్షంగానే కొనసాగుతున్నాయి. అందుకు కారణం పాలకులు అనుసరిస్తున్న విధానాలే. ఉద్దేశ్యపూర్వకంగా రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలను కరువు పీడిత ప్రాంతాలుగా పాలకులు ఉంచదలచుకొన్నారు. అందుకు అనుగుణంగానే రాయలసీమ, తెలంగాణలోని అత్యధిక ప్రాంతాలు, కోస్తాలోని శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు, పశ్చిమగోదావరి, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలు నిత్యకరువు పీడిత ప్రాంతాలుగా కొనసాగుతున్నాయి. ఇక్కడినుండి ప్రజలు వలసవెళ్లే పరిస్థితి కల్పించి, తద్వారా దేశ - విదేశీ బడా పెట్టుబడిదారులకు చౌకగా కూలీలను అందించటం ధ్యేయంగా పాలకులు పెట్టుకున్నారు.

58 సంవత్సరాల రాష్ట్ర అవతరణలో పాలకులు ఉద్దేశపూర్వకంగానే నీటి ప్రాజెక్టులు నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేస్తూ వస్తున్నారు. బ్రిటిష్ వలస పాలకుల పాలనలో కాటన్ నిర్మించిన ధవళేశ్వరం, కృష్ణా బ్యారేజీల తర్వాత రైతాంగం ఆందోళన ఫలితంగా నాగార్జున సాగర్ ప్రాజెక్టును మాత్రమే నిర్మించారు. అది కూడా రెండవ దశ ఇంతవరకు పూర్తికాలేదు. శ్రీశైలం ప్రాజెక్టు నిర్మించినా, అది జలవిద్యుత్ ప్రాజెక్టుగానే వుంది. తెలుగుగంగ కాలువ ప్రధానంగా మద్రాస్‌కు మంచి నీరు అందించేదిగా వుంది. జలయజ్ఞం పేరుతో ప్రారంభిస్తా మన్న నీటి ప్రాజెక్టులు కాంట్రాక్టర్ల, మంత్రుల, అధికారుల జేబులు నింపటానికే తప్ప సాగునీరు అందించే విధంగా లేవు. జలయజ్ఞం ప్రారంభించి 8 సం॥లు గడిచినా ప్రధానమైన ప్రాజెక్టులు ఏవీ పూర్తికాలేదు.

సాగునీటి రంగం ఎడల పాలకులు అనుసరిస్తున్న విధానాలవలన రాష్ట్రంలో ప్రతి సంవత్సరం వేలాది టి.యం.సి.ల నీరు సముద్రం పాలౌతున్నది. ఈ నీరు సద్వినియోగమై వుంటే ఎటువంటి దుర్భిక్షాన్నైనా ఎదుర్కొని సేద్యం సాగటానికి అవకాశం వుండేది. ఆ పరిస్థితి లేకపోవటమే రాష్ట్రంలో అతివృష్టి-అనావృష్టికి కారణంగా వుంది.

## నీటి విడుదలకు కుంటిసాకులు-రాష్ట్రాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్న పాలకులు

వర్షాభావ పరిస్థితుల మూలంగా ఆంధ్రప్రదేశ్‌లో ఇంతవరకు సేద్యం ముందుకు సాగటంలేదు. కనీసం నారు మళ్ళకి కూడా నీరు అందటంలేదు. ఇలాంటి స్థితిలో రైతాంగం తీవ్ర ఆందోళన చెందుతున్నారు. సాగర్ ప్రాజెక్టు - కృష్ణా బ్యారేజీల్లో నీరు తక్కువగా వుండటంవలన సాగునీరు కాల్వలకు విడుదల సాధ్యం కాదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం చెబుతున్నది. కాంగ్రెసు ప్రభుత్వం అధికారంలో వున్నప్పుడు పరిస్థితే ఇప్పుడు రాష్ట్రంలో వుంది. అప్పుడు తెలుగుదేశం పార్టీ సాగునీరు విడుదల సాధ్యమేనంటూ ఆందోళనకు దిగింది. మరి ఇప్పుడు ఎందుకు సాధ్యం కాదంటున్నది? దీన్ని గమనిస్తే ఆచరణలో పాలక పార్టీలన్నీ ఒకే విధానాన్నే అనుసరిస్తున్నాయి.

నీటి విడుదల విషయమై ప్రభుత్వం చెబుతున్న మాటలు రైతాంగాన్ని వంచించటమే. కృష్ణా బ్యారేజీలో ప్రస్తుత నీటిమట్టం 11.7 అడుగులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. నీటిమట్టం 12 అడుగులు వుంటేనే సాగునీటి విడుదల సాధ్యమని అంటున్నారు. ఇది వాస్తవం కాదు. నీటిమట్టం 6 అడుగులలోపు వున్నా కాల్వలకు నీరు విడుదల సాధ్యమన్న విషయం ఇరిగేషన్ అధికారులకు-ప్రభుత్వానికి తెలియంది కాదు. అలాంటప్పుడు 11.7 అడుగులు నీరు వుంటే కాల్వలకు నీటి విడుదల ఎందుకు సాధ్యంకాదు? అందుకు కారణం ఏ పాలకపార్టీ చెప్పటంలేదు. వి.టి.పి.యస్ (విజయవాడ థర్మల్ విద్యుత్ కేంద్రం)కి కృష్ణా బ్యారేజీ నుండి నీటిని సప్లయ్ చేయటంకోసమే. అందుకు 11.5 అడుగుల నీటి మట్టాన్ని కొనసాగించాల్సి వుంది. అందుకే కాల్వలకు సాగునీరు విడుదల చేయటంలేదు. దీనిపై తీవ్రవిమర్శలు వెల్లువెత్తటంతో చంద్రబాబు ముఖ్యమంత్రిగా వున్న (2002లో)కాలంలో థర్మల్ విద్యుత్ కేంద్రానికి భూమినుండి పైప్‌ల ద్వారా నీరును సమకూర్చుకోవాలని అందుకు 200 కోట్లు కేటాయించటం, పైప్ లైన్లు వేయటం జరిగింది. అయినా వాటి ద్వారా నీరు తీసుకోకుండా బ్యారేజీ నుండి వి.టి.పి.యస్‌కు నీరు సప్లయ్ ఎందుకు చేస్తున్నారో ప్రభుత్వమే చెప్పాలి. నీటి ప్రాజెక్టుల ప్రాధాన్యతను విస్మరించిన పాలకులు, సేద్య అవసరాలను తీర్చకుండా విద్యుత్ కోసం నీటిని ఉపయోగించటం సాగునీటి రంగం ఎడల, సేద్యం ఎడల దాని నిర్లక్ష్యం వెల్లడౌతున్నది. సాగర్ నీటిమట్టం 508 అడుగులు వుంటేనే కాల్వలకు నీరు విడుదల సాధ్యం కాదు. ప్రస్తుతం నాగార్జున సాగర్ నీటిమట్టం 517 అడుగులకు మించి వుంది. అలాంటప్పుడు కాల్వలకు నీరు విడుదల ఎందుకు సాధ్యంకాదు? ఇక్కడ కూడా విద్యుత్ ఉత్పత్తికే ప్రాధాన్యత ఇస్తున్నారు. దీన్ని గమనిస్తే ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వాలు సాగునీరు విడుదల చేయటం లేదు.

రాష్ట్రంలో కరువు కరాళ నృత్యం చేసే ప్రమాదం ఎదురౌతున్నది. ఈ స్థితిలో సాగర్‌లో వున్న నీటిని నాట్లు వేసేందుకూ, తాగునీటికీ పొదుపుగా వినియోగించుకుంటే జూలై చివరిలోనూ ఆగస్టు మొదట్లోనో పడే వర్షాలతో సాగు కొనసాగించేందుకు అవకాశం ఏర్పడుతుంది. సమస్యను సూటిగా పరిష్కరించుకునేబదులుగా, తాగునీటికి అతిగా 10 టిఎంసిలు కావాలని ఆంధ్రప్రదేశ్, ఈ నీటితో నారుమడులు పోసి తర్వాత మళ్ళీ నీళ్ళడుగుతారని తెలంగాణా ప్రభుత్వాలు రగడ చేయటం, ఉన్న నీటిని కూడా రైతాంగానికివ్వకుండా చేయటానికేనన్నది స్పష్టం. ఎందువల్లనంటే సాగు సాగాలంటే ఆగస్టు మొదటినాటికి వర్షాలుపడి రిజర్వాయర్లు నిండాలి. నిండకపోతే నారుమళ్ళు ఎండిపోతాయి. నిండితే నాట్లు పడతాయి. ఇప్పుడు నారుమళ్ళు వేస్తేనే అప్పుడు నాట్లు సాధ్యమౌతుంది. రిజర్వాయర్లు నిండితే పంపకానికి ఎలాగూ బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఆవర్డు వుంది. సూటైన పరిష్కారాన్ని వదిలిపెట్టి, నీటిని సాగర్ రిజర్వాయర్లలోనే ఉంచటం ఎవరికీ ప్రయోజనకారి కాదు.

నీటి విడుదలలో రైతాంగాన్ని మోసంచేస్తున్న ప్రభుత్వాలు, నీటి సమస్యపై తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ ప్రజల మధ్య విద్వేషాన్ని రెచ్చగొడుతున్నాయి. వర్షాభావ పరిస్థితులవలన కృష్ణా బ్యారేజీ నీటిమట్టం తక్కువగా వుందని, ప్రజల త్రాగునీటి అవసరాలకోసం 10 టి.యం.సి.ల నీరు సాగర్‌నుండి విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరగా, దాన్ని తెలంగాణ రాష్ట్రప్రభుత్వం వ్యతిరేకించింది. సాగర్‌నుండి నీరు విడుదలచేస్తే త్రాగునీటికే కాకుండా నారుమళ్ళకు కూడా వినియోగిస్తారని, తెలంగాణ రైతులకు అన్యాయం జరుగుతుందని అక్కడి ప్రజలను ప్రభుత్వం రెచ్చగొడుతున్నది. తెలంగాణ ప్రభుత్వం మొండివైఖరి వలనే సాగర్ నీరు విడుదల జరగటంలేదని ఆంధ్రప్రదేశ్ ప్రజలను ఇక్కడి ప్రభుత్వం రెచ్చగొడుతున్నది. ఈ విధంగా నీటి సమస్యను అడ్డంపెట్టుకొని ప్రజలమధ్య విద్వేషాలను రెండు ప్రభుత్వాలు రెచ్చగొడుతున్నాయి. నీరు విడుదలకు అవకాశం వున్నప్పుడు దేనికి ఉపయోగించుకొన్నా అభ్యంతరం వుండాల్సిన అవసరం ఏముంది? చివరికి కేంద్ర జలబోర్డు రెండు దఫాలుగా 6 టి.యం.సి.ల నీరు విడుదల చేయించి నీటి సమస్యను ప్రజల మధ్య వైరుధ్యంగా మారుస్తున్నది. ముందు ముందు రెండు రాష్ట్రాల మధ్య నీటి తగవులు తీవ్రమయ్యే పరిస్థితిని రెండు రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర జలబోర్డు సృష్టిస్తున్నాయి.

సాగునీరు అందించటంలోనూ, దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కోవటంలోనూ పాలకులు అనుసరిస్తున విధానాలను రెండు రాష్ట్రాల రైతులు, ప్రజలు అర్థంచేసుకొని ప్రాజెక్టుల నిర్మాణంకోసం, సాగునీటి సమస్య పరిష్కారంకోసం, వర్షాభావ పరిస్థితుల్లో తీసుకోవాల్సిన తక్షణ చర్యల గురించి రెండు రాష్ట్రాల రైతాంగం పరస్పర సహకారంతో ఉద్యమించాలి. ఇరిగేషన్‌కోసం నిర్మించిన ప్రాజెక్టుల నీటిని అందుకోసమే వినియోగించాలని ఇతర అవసరాలకు ఆ తర్వాత సప్లయ్ చేయాలని డిమాండ్ చేయాలి. ✡

**రాష్ట్రంలో జూన్ 18 వరకు జిల్లాల్లో నమోదైన వర్షపాత వివరాలు**

| జిల్లా పేరు | ఈ సీజన్లో వర్షపాతం | సాధారణ వర్షపాతం | వృద్ధి-లోటుశాతం |
|---|---|---|---|
| శ్రీకాకుళం | 38.8 | 110.6 | - 65 |
| విజయనగరం | 48.5 | 104.4 | - 54 |
| విశాఖపట్నం | 48.0 | 99.8 | - 52 |
| తూర్పుగోదావరి | 7.7 | 93.3 | - 92 |
| పశ్చిమగోదావరి | 10.5 | 93.8 | - 89 |
| కృష్ణా | 16.8 | 83.3 | - 80 |
| గుంటూరు | 10.0 | 67.8 | - 85 |
| ప్రకాశం | 10.8 | 50.9 | - 79 |
| నెల్లూరు | 20.5 | 42.9 | - 52 |
| కడప | 43.3 | 60.1 | - |
| కర్నూలు | 72.5 | 64.3 | + 13 |
| చిత్తూరు | 49.7 | 58.2 | - 15 |
| అనంతపురం | 51.6 | 47.8 | + 8 |

ఆధారం : జూన్ 2014 సాక్షిపత్రిక




**అణచబడ్డ దళితులంతా తిరగబడండి**

పేజీలు : 144

వెల : రు. 50/-

కాపీలకు : **మైత్రీబుక్‌హౌస్**

జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్,

విజయవాడ-2

# ఏకీకృత పౌరస్మృతి చట్టం ఇప్పటికిప్పుడు సాధ్యపడదు; చేయరాదు

## చిన్న చిన్న సంస్కరణల ప్రాధాన్యతను గుర్తించాలి

ఫైజాన్ ముస్తఫా

*హైద్రాబాదులోని 'నల్సార్ యూనివర్శిటీ ఆఫ్ లా' వైస్ ఛాన్సెలర్, ఆలీఘర్ ముస్లిం యూనివర్శిటీ మాజీ రిజిస్ట్రార్ అయిన ఫైజాన్ ముస్తఫా ఇంగ్లీషు దినపత్రిక 'ది హిందూ'లో వ్రాసిన వ్యాసానికి అనువాదమిది. ఏకీకృత పౌరస్మృతిని రాజకీయ వివాదంగా చేయటంతో పడిన చిక్కుముడులను, ఏర్పడిన పొరపాటు భావాలనూ వివరించిన వ్యాసమిది. చట్టంతో ప్రజలలో ప్రబలంగా వున్న ఆచార వ్యవహారాలను మార్చటం సాధ్యంకాదనీ, చిన్న చిన్న సంస్కరణల అమలుతో క్రమ పరివర్తన తీసుకురాగల అవకాశాన్ని వివరించింది. ప్రత్యేకించి ప్రజల సాంస్కృతిక జీవనంలో చెడుగును సమూలంగా నిర్మూలించటంలో సంస్కరణల ప్రాధాన్యతను వివరించింది.* **- సంపాదకుడు**

**1986లో** నేను ఒకసారి ఆలీఘర్ నుండి మొరాదాబాద్ బస్సులో ప్రయాణిస్తుండగా, మా బస్సు ఒక ధాబా దగ్గర ఆగింది. అక్కడ కూర్చునివున్న ఓ వృద్ధుడు ఓ ఉర్దూ వార్తాపత్రికలోని విషయాలను బిగ్గరగా చదువుతున్నాడు. "ఏకీకృత పౌరస్మృతి చట్టం చేయబడితే, ముస్లిములు తమ మతస్థుల మృత దేహాలను ఖననం చేసేందుకు అనుమతించబడరు. హిందూ మతస్థుల మాదిరిగానే వారు కూడా ఆ మృతదేహాలను దహనం చేయవలసి వస్తుంది" అని అతనన్నాడు. ఇది విన్న నేను ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాను. కానీ, ఏకీకృత పౌరస్మృతి యొక్క వాస్తవ అర్థమేమిటో అత్యధిక ముస్లిములకు ఈనాటికీ తెలియదనేది నిజం. భారతీయ జనతాపార్టీ అధికారంలోకి రావటంతో గతంలోని చర్చ తిరిగి లేవనెత్తబడింది.

ఏకీకృత పౌరస్మృతి అంటే చక్కగా నిర్వచించబడిన వైఖరులున్నాయి. మానవహక్కుల పరిరక్షణావాదులు, ఫెమినిస్టులు మరియు సంఘ్ పరివార్ మద్దతుదారులు దీనికి అనుకూలంగా వుండగా, ముస్లిమ్ ఛాందసవాదులు దీనిని వ్యతిరేకిస్తున్నారు. ఎవరూ కూడా సమస్యను హేతుబద్ధంగా చూసేందుకు సిద్ధంగాలేరు. తరచుగా ముస్లిముల వెనకబాటుతనాన్ని ముస్లిముల మతచట్టంతో ముడిపెట్టడం జరుగుతూ వస్తోంది. హిందూ చట్టంలో పలు సంస్కరణల తర్వాత కూడా రోజుకు 20 రూ॥ మాత్రమే సంపాదించుకోగలిగిన వారుగా అత్యధిక హిందువులు వెనుకబాటుతనంలోనే వున్నారు. వివిధ ముస్లిము దేశాలు ముస్లిము చట్టంలో మౌలికమైన మార్పులు చేశాయి. కానీ అవి ఈనాటికీ చాలా వెనుకబడివున్నాయి. కనుక, ఏకీకృత పౌర స్మృతి చట్టం – ఆయా సమూహాలను వెనుకబాటుతనాన్నుండి బయటపడవేసి, వారి పరిస్థితులను మెరుగుపరిచేందుకు ఎంతవరకు తోడ్పడుతుంది? ఆర్థికాభివృద్ధికిగానీ, ఉద్యోగ కల్పనకుగానీ ఇదేమీ దోహదపడదు.

### అభివృద్ధితో సంబంధంలేదు

సాధారణంగా, ఏకీకృత పౌరస్మృతి చట్టం చేయటానికి అనుకూలంగా మూడు వాదనలు ముందుకు తెస్తున్నారు. ఈ చట్టం – జాతీయ సమైక్యతకు దోహదపడుతుంది; మైనారిటీ మతస్థులను ప్రధాన స్రవంతిలోకి తీసుకువస్తుంది; మత సామరస్యాన్ని పెంపొందిస్తుంది; మహిళల స్థాయిని మెరుగుపరిచేదిశగా తోడ్పడుతుంది. ఈ వాదనల ప్రకారం ముస్లిములు జాతీయ ప్రధాన స్రవంతిలో లేరంటే, ఇక 'జాతీయ సమైక్యత' 'ప్రధాన స్రవంతి' అనే పదాలు అర్థంలేనివన్నమాట!

పైగా, హిందువులు 'సప్తపది'ని ఆచరించి, ముస్లిములు 'నిఖా'ను అనుసరించటం వలననో; లేదా హిందువులకు ఒకరకపు విడాకులచట్టం, ముస్లిములకు మరొక రకపు విడాకుల చట్టం వుండటం వలననో మతతత్వ దాడులు చోటుచేసుకుంటున్నాయని ఖచ్చితంగా ఎవరూ చెప్పలేరు. అదేవిధంగా, ఆయా సమూహాల అభివృద్ధి లేదా వెనుకబాటులు ఎలా వున్నప్పటికీ, దానికీ–వారి మతచట్టాలకీ సంబంధమే లేదు.

ఈ చర్చ సందర్భంగా తరచుగా వదలివేయబడే అంశమేమంటే, హిందూ చట్టాన్ని ఇప్పటికే మనం సంస్కరించుకున్నాం. ఇది హిందూ మహిళల అభ్యున్నతికి దోహదపడిందా? ఎంతమంది హిందూ మహిళలు ఆస్థిలో వాటాను పొందగలుగుతున్నారు. సంస్కరించబడిన హిందూ చట్టప్రకారం హక్కుగా పొందవలసిన భూమిలో ఒక చిన్న భాగాన్ని మాత్రమే హిందూ మహిళలు నిజానికి వారసత్వంగా పొందగలుగుతున్నారు. మహిళలకు వారసత్వంగా భూమి సంక్రమించినప్పటికీ, అది సమాన వాటాకంటే తప్పకుండా తక్కువగా వుంటుంది. మహిళలు, కూతుర్లుగా కంటే భర్త చనిపోయిన తర్వాత మాత్రమే అధిక భూములు పొందటానికి అవకాశముంది. మహిళలు వారసత్వంగా భూమిని కలిగివుండాలనుకున్నప్పటికీ, వారి కుటుంబంలోని సామరస్య సంబంధాలను నొప్పించకుండా తప్పించేందుకోసం, వారి తల్లిదండ్రుల ద్వారాకంటే, వారి భర్తవైపు నుండి పొందేందుకే ప్రాధాన్యమిస్తారు. రిజిస్ట్రేషన్ ఫీజులు, స్టాంపు ఫీజులు తగ్గించుకునేదాన్ని అవకాశంగా తీసుకొని, పురుషులు తమ భార్య లేదా కోడళ్ళ పేరున భూమిని కొనుగోలుచేసినా, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్‌ను తమ వద్దే వుంచుకొని భూమిపై తమ అదుపునే వుంచుకుంటారు. చట్టంలో ప్రామాణికమైన మార్పులు చేయటం, సమాజానికి అవసరమైన సంస్కరణలను ఖచ్చితంగా సాధించలేదు.

ఇంకా చెప్పాలంటే, రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు, ప్రభుత్వాలు చేపట్టాల్సిన సానుకూల కర్తవ్యాలు. కాగా, ఏ ప్రభుత్వమూ ఏకీకృత పౌరస్మృతి యొక్క ఖచ్చితమైన నమూనాను ఎందుకు తయారు చేయదు? అటల్ బిహారీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం కూడా కేవలం అధికారంలో కొనసాగేందుకు దానినెందుకు ప్రక్కనబెట్టింది? ఒక ఖచ్చితమైన నమూనా లేకపోవటంతో, ఏకీకృత పౌరస్మృతి ఫలితంగా మరణానంతర కర్మకాండల వంటి అంశాలలో ఏకీకృత విధానాలు చేపట్టాల్సి వుంటుందని ప్రకటిస్తూ, ఈ అంశంపై వున్న అజ్ఞానాన్ని ఛాందసవాదులు దుర్వినియోగం చేస్తున్నారు. ప్రస్తుతం వునికిలో వున్న హిందూ చట్టం ఎట్టి పరిస్థితుల్లోనూ ఏకీకృత పౌరస్మృతి కాదు, కాలేదు. బిజెపి ప్రభుత్వం వెంటనే దీనిని చేపట్టేటట్లయితే, ఏకీకృత స్మృతి చట్టం చేయటానికి అత్యావశ్యకమైన వాతావరణాన్ని ఎన్నటికీ ఏర్పరచలేరు; వివిధ విభాగాల నుండి ఉద్వేగపూరిత అరుపులను మాత్రమే వినగలుగుతాం.

ఆదేశిక సూత్రాలలోని ఏకీకృత పౌరస్మృతి గురించి నొక్కి చెప్తున్నప్పుడు, దీనికంటే మరింత ప్రాధాన్యం కలిగిన ఇతర ఆదేశిక సూత్రాలను – పనిహక్కు, జీవనానికి సరిపడిన వేతనాలు, కొద్దిమంది చేతుల్లో సంపదలు పోగుపడటాన్ని నిరోధించటం, ప్రాచీన కట్టడాలను పరిరక్షించటం వంటి అంశాలు – అమలుచేయకపోవటం గురించి ఎవరూ మాట్లాడక పోవటమనేది అసహనాన్ని కలిగించే విషయం కూడా. ఒక మతానికి చెందిన వారి చట్టాన్ని, ఆ సమూహం యొక్క మెరుగుదల కోసం మార్పుచేసే దృష్టితో సవరించటం ఒక అంశం. కానీ, 'ఏకీకృతాన్ని' ప్రవేశపెట్టే పరమ ప్రయోజనంతో చట్టం పేరుతో అతుకు వేయబోవటం మొత్తంగా భిన్నమైన అంశం. మొదటిది సంస్కరణకు చెందిన చట్టం కాగా, రెండవది ఆమోదం పొందలేని నిరంకుశ చర్య.

### ఏకీకృత పౌరస్మృతిని ఆమోదించటం

వివిధ దేశాలలో ముస్లిము చట్టం సంస్కరించబడింది. అయినప్పుడు, భారతదేశంలో సంస్కరణలను ముస్లిములు ఎందుకు వ్యతిరేకిస్తున్నారు? భారతదేశంలో ముస్లిములు తమ అస్తిత్వ సమస్యతో ముడిపడిన 'అల్ప సంఖ్యాక మానసికతత్వం' కలిగి వుండటమే దానికి కారణం. ఏకీకృత పౌరస్మృతితో తమ ప్రత్యేకమైన అస్థిత్వానికి భంగమేమీ వాటిల్లదని వారిని అంగీకరించనీయండి. వారిని నూతన ప్రభుత్వంలో విశ్వాసాన్ని పెంచుకోనీయండి. ప్రభుత్వ అధికార చట్టంలో న్యాయమైన, సమానమైన వారి వాటాను వారిని పొందనీయండి. మతహింసకు కారకులైన నేరస్తులకు మంత్రి పదవులు కట్టబెట్టకండి. ఏకీకృత పౌరస్మృతికి ఆమోదం అప్పుడే మరింత సులభతరం కాగలదు. పశ్చిమ దేశాలలో ఏకీకృత కుటుంబ చట్టాలు అమలులో ఉన్నప్పటికీ, ఇస్లాం చాలా వేగంగా పెరుగుతున్నదనే అంశాన్ని భారతదేశంలో ముస్లిములు గుర్తించి తీరాలి. అందువల్ల ఇక్కడ అనేకమంది భావిస్తున్నట్లుగా ఏకీకృత పౌరస్మృతి మతానికి పెను ప్రమాదం కాబోదు.

హిందూ ఉమ్మడి కుటుంబ వ్యవస్థలోని అనేక మంది హిందువులు తమ స్వీయచట్టాన్ని అవకాశంగా తీసుకొని ఆదాయపన్ను శాఖకు లక్షల రూపాయల విలువగల నష్టాలను కలుగజేస్తున్నారనే అంశాన్ని ఎవరూ ఎత్తిచూపకపోవటం కూడా ఆందోళనకరమైనది. బిజెపి ప్రభుత్వం ఈ సౌకర్యాన్ని తగ్గించేవైపుగా మొదటి అడుగు వేయగలదా?

ఏకీకృత పౌరస్మృతిని చట్టంగా చేయపూనుకోవటం మత సామరస్యాన్ని దెబ్బతీస్తుంది. చిన్నపాటి సంస్కరణలు చేపడుతూ రావటమే మెరుగైన విధానం. ఈ చట్టాలకు విరుద్ధంగా వున్న పలు సంస్కరణలు ఇప్పటికే వున్నాయి. బ్రిటీష్ పాలకులు ముస్లిము చట్టంలో అనేక మార్పులు చేశారు. బానిసత్వం రద్దు చేయబడింది; మతవిశ్వాసాన్ని వదలుకోవలసివస్తే పౌరహక్కులు కోల్పోవటాన్ని రద్దుచేశారు. ఇస్లామిక్ నేరచట్టం రద్దయింది; దీని స్థానంలో భారత నేరస్మృతి అమలులోకి వచ్చింది; ఒక సమగ్రమైన ఎవిడెన్స్ చట్టం చేయబడటంతో ముస్లిము ఎవిడెన్స్ చట్టం వాడుకలో లేకుండా పోయింది. ఏకీకృత పౌరస్మృతి ఒక్కసారిగా చట్టం చేయరాదు; చేయకూడదు. ✡

# గిరిజనోద్యమ ఆత్మబంధువు

## కా॥ కొండు కృష్ణయ్యగారికి జోహార్లు



**కామ్రేడ్** కొండు కృష్ణయ్యగారు తన 94వ ఏట తూర్పుగోదావరి జిల్లాలోని పురుషోత్తమపట్నం గ్రామంలో 24-6-2014న అనారోగ్యంతో మరణించారు. ఆయన గిరిజనోద్యమ నిర్మాణానికి సహకరించినందుకు 1969లో ఒకసారి జైలుకెళ్ళారు. మరల గిరిజనోద్యమ విస్తరణకి సహకరించినందుకు మరోసారి జైలుకెళ్ళారు. కామ్రేడ్ కొండు కృష్ణయ్యగారికి ఏజెన్సీ గిరిజన సంఘం, రైతుకూలీ సంఘం, సిపిఐ(యం-యల్) నివాళులు అర్పిస్తున్నాయి.

1969లో కమ్యూనిస్టు విప్లవకారులు 'తక్షణ కార్యక్రమం' అమలులో భాగంగా తూర్పుగోదావరి ఏజెన్సీలో కృషి మొదలుపెట్టారు. 1969 జనవరి నాటికి కొండమొదలులో కార్యక్రమాలు మొదలయ్యేసరికి కామ్రేడ్ కొండు కృష్ణయ్య, గూడపాటి రామారావుగారలు పొగాకు (బ్యారను) వ్యవసాయం కోసం కొండమొదలులో ఉంటున్నారు. వీరి మిత్రుడు సూరపనేని సాంబయ్యగారు కలప వ్యాపారం చేసుకొంటూ వుండేవారు. గిరిజన సంఘ ప్రారంభం నుంచి వీరు ప్రజల తరపున మాట్లాడారు, నిలబడ్డారు, నిర్బంధాలకు గురయ్యారు. కొండమొదలు గిరిజనోద్యమం ఒక స్థాయికి చేరే క్రమంలో పెరిగిన నిర్బంధంలో గూడా కామ్రేడ్ కృష్ణయ్యగారు సంఘానికి అండగా నిలిచారు. 1969లో ఒక సంవత్సరం రాజమండ్రి సెంట్రల్ జైలులో నిర్బంధించబడ్డారు. ఈ నిర్బంధంతో కృష్ణయ్యగారు బెంబేలుబడలేదు. తిరిగి 1973లో సంఘ పునర్నిర్మాణ ప్రారంభం నుంచి 1990ల వరకు కొండమొదలు గిరిజనోద్యమానికి అన్నిరకాల సహాయ సహకారాలందిస్తూ వచ్చారు. ఈ దశలో కామ్రేడ్ కృష్ణయ్యగారు, సూరపనేని సాంబయ్యగార్లు నిర్వహించిన పాత్ర ప్రజలు మరచిపోలేనిది.

తిరిగి 1989 నుంచి గిరిజనోద్యమం విస్తరించింది. పోలవరం ప్రాంతంలో భూపోరాటాలు ప్రారంభమైనాయి. వీటికి అండదండలందిస్తున్నారనే ఆరోపణతో 70 సంవత్సరాల వయస్సులో వున్న కృష్ణయ్య, సాంబయ్యగార్లపై తప్పుడు కేసులుపెట్టి అరెస్టు చేశారు. ఆ నిర్బంధాన్ని కామ్రేడ్ కృష్ణయ్యగారు నిబ్బరంగా ఎదుర్కొన్నారు. ఆ తర్వాత కూడా గిరిజనుల సమష్టి వ్యవసాయ విషయంలో, భూములను కాపాడుకునే విషయంలో విలువైన సలహాలను అందిస్తూనే వచ్చారు. గిరిజనులు భూములు సాగుచేసుకొని వ్యవసాయంలో స్థిరపడటం చూసి ఎంతో సంతోషించేవారు.

కృష్ణయ్యగారి స్వగ్రామం గోదావరి ఒడ్డున ఏజెన్సీకి ఆనుకొని వున్న పురుషోత్తమపట్నం. 1930ల నాటికి సీతానగరంలో కస్తూరిబా ఆశ్రమం; అక్కడ నుంచి సాగుతున్న జాతీయోద్యమ కార్యక్రమాల ప్రభావం రైతు కుటుంబాలపై గణనీయంగా పడ్డకాలం. కామ్రేడ్ కృష్ణయ్య స్కూలు విద్యార్థిగానే జాతీయ భావాలవైపు ఆకర్షితులయ్యారు. జాతీయోద్యమ ప్రభావంతో హిందీ నేర్చుకోవాలనే పట్టుదలతో హిందీ నేర్చుకున్నారు. తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలో జరుగుతున్న వర్గపోరాటాలూ, కమ్యూనిస్టు ఉద్యమ ప్రభావంతో 1940-51 తెలంగాణా సాయుధ పోరాట కాలంలో ఉద్యమానికి తోడ్పాటుగా వుండేవారు.

కామ్రేడ్ కొండు కృష్ణయ్యగారిది ఉన్నతమైన వ్యక్తిత్వం. సాధారణంగా ఏజెన్సీలో ప్రవేశించే గిరిజనేతరులు గిరిజనుల జీవిత విధానంలోని అమాయకత్వాన్ని, మంచితనాన్ని చూసి వారిని దోపిడీ చేయటం ఒక హక్కుగా భావిస్తారు. అలా గిరిజన ప్రాంతాల భూమి, శ్రమలను దోపిడీ చేయకపోవడం చేతకానితనంగా గిరిజనేతర అగ్రకుల కుటుంబాల మధ్య పరిగణించబడుతుంది. కామ్రేడ్ కృష్ణయ్యగారు సుదీర్ఘకాలం ఏజెన్సీలో వ్యవసాయం చేసినా ఏనాడు ఈ దోపిడీ మనస్తత్వాన్ని అంగీకరించలేదు. "1969లో మీ భూములు మీరు ఆక్రమించుకోండి, నేను నా 30 ఎకరాల పొగాకు సాగు (బ్యారన్ వ్యవసాయం)ని విడిచి పెట్టి వెళ్తాన"ని గిరిజనులను ప్రోత్సహించేవారు. కార్యకర్తలకు, స్థానిక పరిస్థితులపై అంచనాలిస్తుండేవారు. అనేకమంది గిరిజన సంఘ వ్యతిరేకులు, ప్రజావ్యతిరేకులు కామ్రేడ్ కృష్ణయ్యగారిని వారి వర్గంవాడిగా, అగ్రకులంవాడిగా గుర్తించకుండా కక్షతో వ్యవహరించేవారు. ఆయన జీవితంలోని అనేక ఒడిదుడుకులను, నిర్బంధాలను నిబ్బరంగా ఎదుర్కొన్నాడు. గిరిజనులకు వ్యవసాయం చేసుకోవడంలో తగు సూచనలు చేయడమేగాక సహకారంగా వుండేవారు. ఆయన లేకపోవడం గిరిజనోద్యమం ఒక పెద్ద దిక్కును కోల్పోయినట్లయింది. ఆయన కుటుంబ సభ్యులకు – కుమార్తెలు, కొడుకులు, మనమళ్లు – అందరికీ గిరిజన సంఘం, రైతుకూలీసంఘాలు, జిల్లా సిపిఐ(యం-యల్) ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాయి.

### కా॥ కృష్ణయ్యగారి అంతిమయాత్ర - అంత్యక్రియలు

కామ్రేడ్ కొండు కృష్ణయ్యగారి మరణవార్త తెలిసిన వెంటనే ఏజన్సీ గిరిజన సంఘం రైతుకూలీసంఘం(ఆం.ప్ర) కార్యకర్తలు 40 మంది తరలివెళ్ళి ఆయన భౌతికకాయంపై ఎర్రజెండాను వుంచి నివాళులర్పించారు. గిరిజనోద్యమ ఆత్మబంధువు కామ్రేడ్ కృష్ణయ్యగార్కి జోహార్లని నినదిస్తూ శ్మశానం వరకు సాగిన అంతిమయాత్రలో పాల్గొన్నారు.

6-7-2014న కా॥ కృష్ణయ్యగారి సంస్మరణ కార్యక్రమంలో రైతుకూలీ సంఘం(ఆం.ప్ర) రాష్ట్ర నాయకులు కా॥ ఎం.ఎస్.నాగరాజు, ఏజెన్సీ గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు కా॥ ఇల్లా రామిరెడ్డి, ఇంకా కామ్రేడ్స్ కుండ్ల గంగరాజు, కుంజం రామారావు, తదితరులు పాల్గొని జోహార్లర్పించారు. తొలుత ఆయన స్మృతిలో 2 నిముషాలు మౌనం పాటించారు. గిరిజనోద్యమ అభివృద్ధికి కా॥ కృష్ణయ్యగారు అందించిన సహకారాన్ని వక్తలు గుర్తుచేసుకున్నారు. కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలియచేశారు. తొలుత గ్రామంలో కా॥ కృష్ణయ్యగార్కి జోహార్లర్పిస్తూ ప్రదర్శన నిర్వహించారు.

# కమ్యూనిస్టు నాయకులు కా॥ గుర్రం కోటయ్య వర్ధంతిసభ

**పొన్నెకల్లు, 10-6-14 :**

గుంటూరు జిల్లా, తాడికొండ మండలం - పొన్నెకల్లు గ్రామంలో కమ్యూనిస్టు రాజకీయాలను, సిద్ధాంతాలను వ్యాప్తిచేసి పార్టీని నిర్మించిన వారిలో కా॥ గుర్రం కోటయ్య ఆద్యులు. కమ్యూనిస్టు పార్టీలో చీలికలు వచ్చిన క్రమంలో ఆయన విప్లవ కమ్యూనిస్టు రాజకీయాలవైపు నిలబడ్డారు. ఆయన సంస్మరణ సభ పొన్నెకల్లు గ్రామంలో జరిగింది.

1981 పంచాయితీ ఎన్నికలకు ముందు సిపిఐ కాకుండా మిగిలిన కమ్యూనిస్టులందరూ గ్రామ స్థాయిలో కలిసి మరికొందరు పెద్దలను జతచేసుకొని 'ప్రజా ఐక్యసంఘటన'గా ఏర్పడ్డారు. పంచాయితీ ఎన్నికలలో సర్పంచ్ స్థానానికి ప్రజాఐక్యసంఘటన గెలుపును సాధించింది. పంచాయితీ ఎన్నికల తదనంతరం గ్రామప్రజలకు మంచినీటి పథకాన్ని అమలుజరిపించుకొనడంలో స్థానిక సిపిఐ పెత్తందారులు పెట్టిన అడ్డంకులను అధిగమించి గ్రామప్రజలకు మంచినీటి సదుపాయాన్ని ఏర్పరచింది. మంచినీటి వనరుగా జడలమ్మ బానిని వినియోగించే ఏర్పాటు తాత్కాలికంగా చేసింది. గ్రామంలోని తూర్పు చెరువును మంచినీటికి వనరుగా వినియోగించేందుకు పోరాడి, అంతిమంగా పబ్లిక్ చెరువుగా ప్రకటింప జేసింది. గ్రామ ప్రజల మంచినీటి వనరుగా మలచ గలిగింది.

పొన్నెకల్లుకు పటమట వున్న గ్రామాలకు వెళ్ళేదారికి బైపాస్‌రోడ్డు ప్రతిపాదన రాగా, నివాసాల మధ్యనుండి పంచాయితీ ఆఫీస్ దగ్గర రోడ్డుకు కలిసేవిధంగా వొంపుల ఎలైన్‌మెంట్‌ని సిపిఐ పెద్దలు సూచించారు. ఉన్నతస్థాయిలో తమ రాజకీయ పలుకుబడిని ఉపయోగించి బైపాస్ రోడ్డును నిర్మించకుండా అడ్డుపడగా గ్రామ ఉత్తరపు అంచున బైపాస్ ఎలైన్‌మెంట్‌ను సూచించి దాన్ని ప్రజల ముందుంచి ప్రజల ఆమోదంతో అలైన్‌మెంట్ కావాలని ప్రజా ఐక్యసంఘటన పోరాడింది.

గ్రామస్థాయిలో సిపిఐ పెద్దల పెత్తనాన్ని, ఉన్నత స్థాయిలో వారి రాజకీయ పలుకుబడినీ జోడించి, పొన్నెకల్లులో ప్రజాహిత కార్యక్రమం అమలు జరగకుండా చూడాలని వేసుకున్న పథకం కారణంగా 1981-86 మధ్య ఒకవైపున స్థానిక సిపిఐ పెత్తందారులకు, మరోవైపున గ్రామంలో ప్రజా ఐక్యసంఘటనకు, ప్రజలందరకు మధ్య పెద్ద సంఘర్షణ నడచింది. ఆ సంఘర్షణ ప్రజాఐక్యసంఘటనను, దానికి నాయకుడుగా వున్న గుర్రం కోటయ్యను ప్రత్యేక స్థానంలో నిలిపింది.

ప్రజా ఐక్యసంఘటన ప్రతినిధిగా ఎన్నికయిన కా॥గుర్రం కోటయ్య 1986లో మరణించగా గ్రామప్రజా ఐక్యసంఘటన ఆధ్వర్యంలో ఆయన విగ్రహాన్ని ఏర్పరిచారు. కామ్రేడ్స్ మానం రామారావు, మాదాల నారాయణస్వామి, దాసరి గోపయ్య, పోపూరి రామారావు, వావిలాల గోపాలక్రిష్ణయ్య, పుష్పరాజు తదితరుల సమక్షంలో కా॥కొల్ల వెంకయ్య 1986 జూన్‌లో ఆ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అప్పటినుండి గ్రామ ప్రజలు ప్రతిఏటా సంస్మరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ప్రజాఐక్యసంఘటన ఆధ్వర్యంలో 10-6-14న గ్రామస్తులు గుర్రం కోటయ్య విగ్రహం వద్ద నివాళు లర్పించారు. పంచాయితీ సర్పంచ్ గణపవరపు శివలీల, ఉపసర్పంచ్ అన్నే నాగేశ్వరరావు, డిఎస్ఎల్ఎన్ ప్రసాద్, ఆదినారాయణ, బుడే, రోశయ్య, ఆదియ్య తదితరులు పుష్పాంజలి ఘటించారు. సిపిఐ(ఎం.ఎల్) నాయకులు కా॥సింహాద్రి లక్ష్మారెడ్డి, రైతుకూలీసంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఉల్లిగడ్డల నాగేశ్వరరావు జోహార్లు అర్పిస్తూ, ఆయన ఆధ్వర్యంలో సాగిన కృషిని గుర్తు చేశారు. ఎన్‌వైఎస్ - పిడిఎస్ కార్యకర్తలు కా॥గుర్రం కోటయ్య విగ్రహంవద్ద జోహార్లు చెప్పారు. కా॥గుర్రం కోటయ్య స్మారకకేంద్రంలో గ్రంథాలయాన్ని నిర్వహించ మని, విజ్ఞానాన్ని చరిత్రజ్ఞానాన్ని అందించే కార్యకలాపాలు చేపట్టమని వారు గ్రామ పంచాయితీని కోరారు. ✡

# నగరం గ్రామంలో గ్యాసు ప్రమాదం నివారించగలిగినదే

## సమగ్ర భద్రతా చర్యలకై సిపిఐ (ఎం-ఎల్) డిమాండ్



**27-6-2014న** తూర్పుగోదావరి జిల్లా కోనసీమలోని నగరం గ్రామం గుండా సాగిన సహజవాయువు పైపులైను లీకై అగ్నిజ్వాలలు ఎగసి 21మంది మృతిచెందారు. అనేకమంది శరీరం కాలిపోయి ఆస్పత్రి పాలయ్యారు. మృతుల కుటుంబాలకూ, క్షతగాత్రులకూ మా ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నాము. అమలాపురం, కాకినాడ వైద్యశాలల్లోని వైద్యులు, సిబ్బంది బాధితులకు వైద్యమందించటంలో తగిన శ్రద్ధచూపుతున్నారు. అత్యధిక శరీరభాగాలు కాలిపోయి మృత్యువుతో పోరాడుతున్న దుర్భరస్థితిలో బాధితులున్నారు.

ఈ పైపులైను నిర్వహణ ప్రభుత్వరంగ సంస్థ గెయిల్‌ది. తరచుగా గ్యాసు లీకవుతున్నదని స్థానికులు ఫిర్యాదుచేసినా గెయిల్ అధికారులు తగిన శ్రద్ధ చూపలేదు. గ్యాసు లీకైన వెంటనే మూసుకుపోవలసిన వాల్వులు పనిచేయకపోవటం నిర్వహణపట్ల అధికారుల నిర్లక్ష్యాన్ని తెలుపుతున్నది.

గ్యాసు సరఫరా ఆపివేసి, నీటిని పంపి పైపును శుభ్రపరచి, అదే సమయంలో పగుళ్ళు ఏర్పడ్డాయా అని నిర్ణీత కాలవ్యవధిలో పరిశీలించాలి. ఈ పరీక్షలు కూడా తగిన కాలవ్యవధిలో చేపట్టనందున పైపులు తుప్పుపట్టి బలహీనపడుతున్నాయన్న సమాచారం ప్రచారంలో వుంది. విద్యుదుత్పత్తికి ఆటంకం కారాదన్న వత్తిడికి లోనై అధికారులు పైపులైను భద్రతను పట్టించుకోలేదన్న ఆరోపణలున్నాయి.

పైపులైను నిర్మాణంలోనే జనావాసాలకు దూరంగా నిర్మించాల్సిన అవసరాన్ని ఖర్చుతగ్గించటం పేరిట పక్కన పెట్టారని తెలుస్తున్నది.

భూగర్భంనుండీ ఆయిలుగ్యాసు వెలికితీసినందువల్ల భూమి క్రుంగిపోతుందని ఇతర దేశాల అనుభవం తెలుపుతున్నది. వెలికితీత సాగుతున్న కోనసీమ ప్రాంతంలో కొన్నిచోట్ల భూమి క్రుంగిన దాఖలాలు ఇప్పటికే కన్పిస్తున్నాయి. ఇలా భూమి క్రుంగిపోకుండా నివారణాచర్యలున్నాయని కూడా తెలుసు. శాస్త్రజ్ఞులు తగిన ముందస్తు హెచ్చరికలూ చేశారు. ఇలా భూమిక్రుంగినందువల్లనే పైపులైనుకు పగుళ్ళు ఏర్పడి తరచుగా గ్యాసు లీకవుతున్నదన్న ఆరోపణలున్నాయి. దీనికితోడు కాకినాడ జాయింటు కలెక్టరు భూమి క్రుంగటంపై ఒక నివేదికను పంపారనీ, అది బీరువాల్లో బూజుపట్టి పోతున్నదనీ తెలుస్తున్నది.

'రవ్వ' క్షేత్రంలో గతంలో రెండు పెద్ద ప్రమాదాలు జరిగాయి. పాశర్లపూడి బ్లోఅవుటు సమీప ప్రాంత ప్రజలను రోజులతరబడి భయభ్రాంతులకు గురిచేసింది. హెచ్‌పిసిఎల్‌లో జరిగిన గ్యాసు లీకు ఎంతటి పెనువిషాదానికి దారితీస్తుందో అనుభవమే. పాశర్లపూడి బ్లోఅవుటు అదుపు చేయటానికి అమెరికానుండి నిపుణులు వచ్చేవరకూ వేచివుండాల్సి వచ్చింది.

ఈ పరిస్థితి - భద్రతా చర్యలపట్ల అధికారుల నిర్లక్ష్యమొక్కటే కారణంకాదనీ, వెలికితీతే ప్రధానంగా సాగిస్తూ భద్రతా చర్యలపట్ల కనీస అవగాహన కూడా విధాన నిర్ణేతలకు లేకుండాపోయిందనీ తెలుపుతున్నది. కొన్ని పెనుప్రమాదాలు సంభవించినా, కళ్ళు తెరచి భద్రతా చర్యలు చేపట్టేవైపుగా కదలకపోవటం ప్రజల జీవితాల భద్రతపట్ల పాలకుల ఉద్దేశపూరిత నిర్లక్ష్యాన్ని తెలుపుతున్నది.

ఈ స్థితిలో ఈ క్రింది తక్షణ, దీర్ఘకాలిక చర్యలు చేపట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండు చేస్తున్నాము.

H మృతుల కుటుంబాలు గౌరవప్రద జీవనం సాగించేందుకువీలుగా తగిన నష్టపరిహారం చెల్లించాలి.

H క్షతగాత్రులందరికీ తగిన చికిత్సా సేవలను ప్రభుత్వం అందించాలి.

H ఇలాంటి ప్రమాదాలు పునరావృతంకాకుండా నివారించటానికి సమగ్ర విచారణ జరిపి ప్రమాద కారణాలను ప్రజలను తెలియజేయాలి.

H ఆయిలు, గ్యాసు వెలికితీత, రవాణా, నిల్వ దీనికోసం ఏర్పాటుచేసిన కలక్షన్ సెంటర్లు, పైపులైన్లు, నిల్వచేసే సదుపాయాలవద్ద తీసుకోవలసిన భద్రతాచర్యలను శాస్త్రీయ పరిశీలనతో రూపొందించాలి.

H వీటికనుగుణంగా భద్రతా చర్యలు అన్నింటినీ అమలుచేసిన తర్వాతనే వెలికితీత, రవాణా, నిల్వలకు అనుమతులివ్వాలి.

H ఈ రంగంనుండి ప్రైవేటు పెట్టుబడిదారీ శక్తులను తప్పించాలి. లాభార్జనే ధ్యేయంగా భద్రతాచర్యలను ఇవి గాలికి వదిలివేస్తున్న ఫలితంగా ప్రమాదాలు జరుగుతున్నాయని ఇటీవలి ప్రమాదవార్తలన్నీ నిర్ద్వందంగా తెలుపుతున్నాయి.

| | | | |
|---|---|---|---|
| **కాకినాడ,** | **గుర్రం విజయకుమార్** | **భూతం వీరయ్య** | **యం.యస్.నాగరాజు** |
| **28-6-14** | **సిపిఐ(ఎం.ఎల్)** | **సిపిఐ(ఎం.ఎల్)** | **రైతుకూలీసంఘం(ఆం.ప్ర)** |

# 'చుండూరు దళితుల న్యాయపోరాట కమిటీ' ఆధ్వర్యంలో ధర్నా



గుంటూరు ధర్నాలో ప్రసంగిస్తున్న కా॥ విజయకుమార్; బందరులో ధర్నా

**గుంటూరు, 16-6-14 :**

'చుండూరు దళితుల న్యాయపోరాట కమిటి' పిలుపు మేరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలోని వివిధ జిల్లా కేంద్రాలలో జూన్ 16న దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాలు జరిగాయి.

గుంటూరులో జరిగిన ధర్నా కార్యక్రమానికి మద్దతుగా వచ్చిన సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్రనాయకులు కా॥గుర్రం విజయకుమార్ మాట్లాడుతూ దేశంలోనూ, రాష్ట్రంలోనూ పెచ్చరిల్లుతున్న దళితులపై హత్యాకాండ, దాడులు, అత్యాచారాలను ప్రస్తావించారు. స్వతంత్రం వచ్చిందని చెప్పబడుతున్న గత ఆరుదశాబ్దాలపైగా కాలంలో కూడా దళితులు, పీడితులపై హత్యాకాండ, దాడులకు పాల్పడిన నేరస్థులకు శిక్షలు పడకుండాను; లేదా క్రిందికోర్టులు నామమాత్రపు శిక్షలు వేసినా పైకోర్టులో రద్దు చేయించుకోవటం ద్వారానూ - శిక్షల నుండి తప్పించుకుంటున్నారని, అంటే ఈ రాజ్యం, ప్రభుత్వాలు న్యాయవ్యవస్థ... అన్నీ భూస్వామ్య, అగ్రకుల, సంపన్నవర్గాల కొమ్ముగాస్తున్నాయనేది స్పష్టమౌతోందన్నారు. గ్రామీణ ప్రాంతంలో అగ్రకుల పెత్తందారుల, భూస్వాముల ఆధీనంలోనున్న భూములన్నింటినీ దళితులు, భూమిహీనులైన పీడిత ప్రజానీకమంతా ఐక్యపోరాటాలద్వారా సాధించు కోకుండా ఈ సమస్య అంతిమంగా పరిష్కారంకాదని, అందుకు సమాయత్తం కావలసిన ఆవశ్యకతను కా॥విజయకుమార్ తన ప్రసంగంలో వివరించారు.

ఈ ధర్నా సందర్భంగా జరిగిన సభలో సిపిఐ రాష్ట్రనాయకులు కా॥ముప్పాళ్ళ నాగేశ్వరరావు, సిపిఎం రాష్ట్రనాయకులు కా॥డి.రమాదేవి, ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర నాయకులు కా॥డివిఎన్ స్వామి, ఇంకా డిబిఎఫ్, సూరీడుపార్టీ, స్త్రీవిముక్తి సంఘటన, వ్యవసాయ కార్మికసంఘం కెవిపిఎస్, డిహెచ్‌పిసి తదితర సంఘాల ప్రతినిధులు పాల్గొని ప్రసంగించారు.

దళితులు, పీడితులంతా ఒక్కటై ఈ దోపిడీ వ్యవస్థను సమూలంగా కూల్చిననాడే దళితులకు నిజమైన న్యాయం దక్కుతుందని, అందుకు పీడితులందరూ ఐక్యపోరాటం సాగించాలని వీరు పిలుపునిచ్చారు. చుండూరు దళితులకు న్యాయం జరిగే వరకూ, హైకోర్టు తీర్పును పునఃసమీక్షించి దోషులకు కఠిన శిక్షలు పడేవరకు పోరాటం సాగించాలని తీర్మానించారు.

అనంతరం కమిటీ సభ్యులంతా ప్రతినిధి బృందంగా వెళ్లి, జిల్లా కలెక్టరుకు మెమోరాండం ఇచ్చారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలనుండి దాదాపు 5 వందలమంది ప్రజానీకం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**బందరు, 16-6-14 :**

చుండూరు దళితుల హత్యకేసులో క్రింది కోర్టు విధించిన శిక్షలను సైతం రద్దుచేస్తూ రాష్ట్ర హైకోర్టు ధర్మాసనం ఏప్రిల్ 22న ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ బొజ్జా తారకంగారి నాయకత్వంలోని 'చుండూరు దళితుల న్యాయపోరాట కమిటి' ఆధ్వర్యంలో బందరు కలెక్టరు కార్యాలయంవద్ద విప్లవ, దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. అనంతరం హైకోర్టు తీర్పును పునఃసమీక్షించి, చుండూరు దళితుల ఊచకోత కేసులో దోషులందరినీ కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేస్తూ వివిధ విప్లవ, దళిత, ప్రజాసంఘాల ప్రతినిధి బృందం కలెక్టరుకు మెమోరాండం అందజేశారు.

ఈ కార్యక్రమంలో రైతుకూలీసంఘం జిల్లా నాయకులు కా॥ జె. జగన్, కా॥ ఈపూరి రాంబాబు, ఏఐఎఫ్‌టియు(న్యూ) జిల్లా నాయకులు కా॥మల్లేష్, స్త్రీవిముక్తి సంఘటన జిల్లా నాయకులు కా॥ పి. అంజమ్మ, మాలమహానాడు కన్వీనర్ కె. శాంసన్, ఎన్‌వైయస్, చేనేత కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

**విజయవాడ, 16-6-14 :**

చుండూరు దళితుల న్యాయపోరాట కమిటి భాగస్వామ్య సంఘాల ఆధ్వర్యంలో విజయవాడ సబ్‌కలెక్టరు కార్యాలయంవద్ద ధర్నా జరిగింది. ఈ ధర్నాలో రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్రకార్యదర్శి కా॥కె.కోటయ్య మాట్లాడుతూ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు-రానున్న రోజులలో దళితులపై మరిన్ని దాడులు జరిగేందుకు ఊతమిచ్చేదిగా వుందంటూ ఆ తీర్పును తీవ్రంగా నిరసించారు. ఈ అగ్రకుల దురహంకార, భూస్వామ్య దోపిడీ వ్యవస్థలో దళితులకు, మైనారిటీలకు న్యాయం జరగబోదని, అందుకే ఈ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటంలో పేదలు, దళితులు, పీడితులంతా ఐక్యంగా కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతుకూలీసంఘం జిల్లా సహాయ కార్యదర్శి కా॥యు.వీరబాబు, ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు కా॥వి.లక్ష్మణ ఇంకా సిపిఐ, సిపిఎం పార్టీల; ఓపిడిఆర్, కెవిపిఎస్, ఐఎఫ్‌టియు, ఎంఆర్‌పిఎస్, దళిత హక్కుల పోరాట సమితి, పిడిఎస్‌యు, అరుణోదయ తదితర ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొని మాట్లాడారు. ధర్నా అనంతరం సబ్‌కలెక్టరుకు మెమోరాండం అందజేశారు. ✡





వెలువడింది

**మతోన్మాదం - సామ్రాజ్యవాదం - భారత పాలకులు**

(వ్యాస సంకలనం)

పేజీలు : 80 వెల : రు. 30/-

కాపీలకు :

**మైత్రీబుక్‌హౌస్**

జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2

# బడా కంపెనీలకు బడిదేవరకొండను కట్టబెట్టే ప్రయత్నాలు - ప్రజల నిరసన

**పార్వతీపురం, 30-6-14 :**

ఏజెన్సీ ప్రాంతాల్లోని అడవి, కొండలు వేల సంవత్సరాలుగా గిరిజనులకేగాక ఏజెన్సీకి ఆనుకొని వున్న మైదానప్రాంత రైతు-కూలీలకు, పేదలకు సహజ ఉపాధి వనరులుగా ఉంటున్నాయి. అడవిలో దొరికే దినుసులు, ఉత్పత్తులు, ఎండుకర్రలవల్ల అటు గిరిజనులు, ఇటు మైదాన గ్రామాల పేదలు జీవనోపాధి పొందుతున్నారు. వీరు తమ కడుపు నింపుతున్న ఈ అడవి, కొండలను దేవతలుగా భావించి చిరకాలంగా ఆరాధిస్తున్నారు. కానీ అడవి, కొండలలోవున్న కోట్ల విలువచేసే గ్రానైట్, ఖనిజ నిక్షేపాలను బహుళజాతి సంస్థలకు, కార్పోరేట్ కంపెనీలకు కట్టబెట్టడానికి పాలకులు సిద్ధపడ్డారు. లాభమే పరమావధిగా కలిగిన ఈ దోపిడీ వర్గాలవల్ల గిరిజనులు అడవి నుండి తరిమి వేయబడటంతోపాటు పేదలు సహజ జీవనోపాధిని కోల్పోతారు. అంతేగాక పర్యావరణ సమస్యలు తీవ్రమౌతాయి.

విజయనగరంజిల్లా పార్వతీపురం మండలం ములిగ పంచాయతీ రెవెన్యూలో సర్వే నెం:1, కోరి రెవెన్యూలో సర్వే నెం:1లో వెలగవలస, బడిదేవరకొండ, పిండిలోవకొండ, చిల్లగుడ్డివలస కొండలు సుమారు 650 ఎకరాలు విస్తరించి వున్నాయి. ఫారెస్ట్ రికార్డుల ప్రకారం పక్క రిజర్వ్‌లో వున్న ఈ కొండలలో విలువైన తెల్లగ్రానైట్ నిక్షేపాలు వున్నాయి. విలువైన ఈ గ్రానైట్ నిక్షేపాలపై బడా వ్యాపారులు కన్నేసి సొంతంచేసుకొని కోట్ల రూపాయలు ఆర్జించడానికి సిద్ధపడ్డారు. ఈ బడావ్యాపారులు ఏ ఫారెస్ట్, రెవెన్యూ అనుమతులు లేకుండానే గతంలో పెద్దపెద్ద మిషన్లు తెచ్చి బడిదేవరకొండని బద్దలుకొట్టి గ్రానైట్ తీయడానికి పూనుకున్నారు. కోరి, గంగాపురం, ములగ, కవిటభద్ర, సంగంవలస, చినబొండపల్లి, వెంకుపేట, యం.ఆర్. నగరం తదితర గ్రామాల ప్రజలు 2006 మే 5న 300మంది బడిదేవరకొండ వద్దకు తరలివెళ్లి మిషన్లను అడ్డుకొని పనులను నిలువరించారు. బడిదేవరకొండ పరిరక్షణ పోరాట కమిటీని ఏర్పాటుచేసుకొని ఆందోళన సాగించి, బడాకంపెనీల చర్యలను అడ్డుకున్నారు.

తిరిగి బడిదేవరకొండను ఆనుకొనివున్న ప్రాంతాన్ని బడాకంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నాలు ఈనాడు జోరుగా జరుగుతున్నాయి. రాజకీయ నాయకుల ఒత్తిడికి తలొగ్గిన అధికారులు ఈ కొండలను కంపెనీలకు అప్పగించే ప్రమాదం పొంచి వుంది. ఇదే జరిగితే ఈ కొండప్రాంతాలలో నివసిస్తున్న గిరిజనుల పోడు వ్యవసాయం దెబ్బతింటుంది. పశువులకు మేత కరువు అవుతుంది. అడవిలో కట్టెలు కొట్టి జీవిస్తున్న పేదలు ఉపాధి కోల్పోతారు. గ్రానైట్ నిక్షేపాలు వెలికి తీసేటప్పుడు వెలువడే దుమ్ము, ధూళివలన ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుంది. అంతేగాక వర్షాకాలంలో ఈ కొండలమీదుగా పారే వరదనీరు గెడ్డలపై మినీ రిజర్వాయర్ నిర్మించి దిగువున ఉన్న భూములకు సాగునీరు అందించాలనే ఈ ప్రాంత రైతాంగపు చిరకాలవాంఛ నెరవేరదు.

ఈ ప్రాంత ప్రజలు బడిదేవర కొండను దేవతగా భావించి పురాతన కాలం నుండి ఆరాధిస్తున్నారు. ప్రతిఏటా కొలిచి మొక్కులు తీర్చుకుంటారు. సకాలంలో వర్షాలు పడనట్లయితే పెద్దఎత్తున జాతర జరిపి వరద పాయసంపోస్తారు. వంటలు చేసుకొని సామూహికంగా భోజనాలు చేస్తారు. ఇప్పుడు బడిదేవరకొండ ప్రాంతాన్ని కంపెనీ బాంబులతో బద్దలకొట్టడం అంటే తమ ఆరాధ్య దేవతమీదపై వేటు వేయడంగా వారు భావిస్తున్నారు. అనాదిగా ప్రకృతిని ఆరాధిస్తున్న సాంప్రదాయాల్ని నమ్మకాల్ని కాలరాచి అన్నిరకాలుగా విధ్వంసంచేసే ఇటువంటి పనులకు ప్రభుత్వం, అధికారులు సానుకూలంగా వున్నారు.

ఈ నేపధ్యంలో భూమి, నీరు, అడవి, కొండ వంటి సహజవనరులపై హక్కు ప్రజలదేనని, బహుళజాతి కంపెనీలది, బడా కాంట్రాక్టర్‌లది కాదని నినదిస్తూ రైతుకూలీసంఘం(ఆం.ప్ర) ఆధ్వర్యంలో బడిదేవరకొండ ప్రాంత ప్రజలు ఆందోళనకు పూనుకున్నారు. 30-6-2014న విజయనగరం జిల్లా - పార్వతీపురం సబ్‌కలెక్టరు కార్యాలయంవద్ద రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) ఆధ్వర్యంలో బడిదేవరకొండ ప్రాంతవాసులు ధర్నా నిర్వహించారు. తొలుత బైపాస్ రోడ్డులోని సంఘం కార్యాలయం వద్దనుండి ప్రదర్శనగా సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరి తమ డిమాండ్లను ఎలుగెత్తి చాటారు.

ఈ సందర్భంగా రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా కార్యదర్శి కా॥డి.వర్మ మాట్లాడుతూ బడిదేవరకొండ ప్రాంతాన్ని తవ్వకాలకు లీజుకు ఇచ్చే ప్రతిపాదనలను విరమించుకోవాలని, సంబంధిత కంపెనీ యజమానులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజలంతా సంఘటితంగా నిలచి లీజు ప్రతిపాదనలు రద్దుయేంతదాకా ఆందోళన కొనసాగించాలని పిలుపునిచ్చారు. ధర్నా అనంతరం డిమాండ్లతో కూడిన మెమోరాండంను సబ్‌కలెక్టరుకు అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఇంకా సంఘం అధ్యక్షులు కా॥ముత్యాలు, ఉపాధ్యక్షులు కా॥బి.నర్సింగరావు, సహాయకార్యదర్శి కా॥ఎం.భాస్కరరావు, సంగంవల్స పంచాయితి సర్పంచి ఎ.రామకృష్ణ, సంగంవల్స ఎమ్‌పిటిసి కోడి వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు. ✡

# రుణాల మాఫీ - సాగునీటి సమస్యల పరిష్కారానికై రైతాంగం ధర్నా

**నల్గొండ, 14-7-14 :**

జులై 14న రైతుకూలీసంఘం నల్గొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పాత మునగాల పరగణాలోని నడిగూడెం, మునగాల మండలాలకు చెందిన గ్రామాలూ, దేవరకొండ డివిజన్‌లోని గుర్రంపోడు తదితర మండలాల గ్రామాల సాగునీరు, తాగునీరు, ఇతర సమస్యలపైనా, అన్ని రకాల రుణాలు రద్దు చేయాలనీ కోరుతూ నల్గొండ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సుమారు 100 మంది రైతాంగం ఈ ధర్నాకు హాజరైనారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గసభ్యులు కా॥ ఎలకా ప్రతాపరెడ్డి, రైతుకూలీసంఘం నాయకులు కామ్రేడ్ ఉప్పలయ్య, రైతుకూలీ సంఘం జిల్లా నాయకులు కామ్రేడ్స్ జక్కుల నరసింహ, బండారు వేలాద్రి, జయరాజు, పి. వెంకటేశ్వర్లు తదితరులు ధర్నాను ఉద్దేశించి ప్రసంగించారు. సమస్యను అధ్యయనం చేసి వివరణాత్మకంగా వారు ఇచ్చిన మెమోరాండంలోని అంశాలు ఈవిధంగా వున్నాయి.

నల్గొండజిల్లాలోని నడిగూడెం మండలంలోని రామాపురం తదితర గ్రామాల రైతులకు సాగర్ ఎడమ కాలువపై సిక్కోలు బ్రిడ్జీ దగ్గర లిఫ్ట్ మంజూరు చేసి, రైతులకు సాగునీరు అందించాలి.

ఏఎమ్మార్పీ ప్రాజెక్టుపై 7బి హైలెవల్ కెనాల్ ద్వారా జువ్విగూడెం గ్రామ చెర్వు రిజర్వు చేసి లిఫ్టు పైప్ లైన్ ద్వారా తేనెపల్లి గ్రామ హనుమాన్ చెర్వు, పెద్ద చెర్వులను నింపాలి.

గుర్రంపోడు మండలంలోని ఏఎమ్మార్పీ ప్రాజెక్టు కాలువ డిస్ట్రిబ్యూటరీ 16, 17 పరిధిలో ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టు పేరుతో తుంపర బిందు సేద్యం చేయుటకు 9-2-2007న జి.ఓ.నెం.34 శాంక్షన్ నెం. 194, తేది 31.8.2007తో మంజూరు చేసి పల్లిపహాడ్, తేరాటిగూడెం, యెరడ్లగూడెం, మొసంగి, పి.ఏ.పల్లి మండలంలోని గనిపెల్లి, భీమనపల్లి, పెద్దవూర మండలంలోని వెల్మగూడెం ఈ గ్రామాల పరిధిలో 5400 ఎకరాలలో సంపులు (బావులు) త్రవ్వి మేజర్ కాల్వల నుండి పైపు లైన్ వేసి కరెంటు లైన్ వేశారు. 19.50 కోట్లు జైన్ కంపెనీకి అప్పగించి ఖర్చు చేసినట్లు తెలిసింది. రైతుల వ్యవసాయ భూములలో పైపులు వేసి గోతులు పూడ్చనందున దొంగలు పైపులు ఎత్తుకెళ్ళారు. కరెంటు ఇవ్వనందున ఎల్.టి.లైన్; కొంతమందికి రైతులకు ఇచ్చిన మోటార్లు, స్టార్టర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు దొంగలు ఎత్తుకెళ్లినారు. ఇప్పటివరకు లైన్ వేయలేదు. కొంతమంది దొంగలపై కేసు పెట్టారు. మోటార్లు, ట్రాన్స్‌పార్మర్లు అమర్చలేదు. పైపుల ద్వారా బావులకు నీళ్ళు రావడంలేదు. పైపులలో రాళ్ళు, చెత్త చేరడంతోబాటు లెవల్‌గా వేయలేదు. జైన్ కంపెనీ వారు రైతుల దగ్గర నుండి డి.డి.లు కట్టించు కొని స్ప్రింక్లర్లు ఇవ్వలేదు. ఆరు సంవత్సరాల నుండి రైతుల భూములకు ఈ తుంపర సేద్యం ప్రాజెక్టు ఫెయిల్ అయింది. చాలా పంట నష్టపోయారు. మెయిన్ కాలువ మేజర్ కాలువలో నీరు పారినా కాలువ వెంట ఉన్న రైతులు మాత్రమే పారించుకుంటూ క్రింది రైతులకు పోనివ్వటం లేదు.

కావున జి.ఓ.నెం.34 రద్దుచేసి భూసేకరణ చేసి మైనర్ కాలువలు, పంట కాలువలు త్రవ్వించాలి. 19వ డిస్ట్రిబ్యూటరీ క్రింద జిన్నాయిచింత, తేరాటిగూడెం, బ్రాహ్మణగూడెం, చేపూరు రైతులకు సుమారు 300 ఎకరాల వరకు మైనర్ కాలువలు, పంట కాలువలు లేవు. 22వ డిస్ట్రిబ్యూటరీ క్రింద ఆమలూరు, బొల్లారం, చేపూరు, కొత్తలాపురం, నడికూడ రైతులకు మైనర్ కాలువలు, పంట కాలువలు లేవు.

24-25 డిస్ట్రిబ్యూటరీ పరిధిలో కొప్పోలు, బోడపాడు రైతులకు మైనర్ కాలవలు, పంట కాలువలు లేవు.

మేజర్ కాలువ నీరు వదిలి నెలరోజులు గడిచినా చెరువులు నిండడంలేదు. మేజర్ కాలువలకు భూసేకరణ చేసి మైనర్ కాలువలు అన్ని చెర్వులకు త్రవ్వించాలి. ప్రాజెక్టు నీళ్ళు చెర్వులకు వస్తున్నవని, చెర్వుల క్రింద ఎకరానికి 200 శిస్తు వసూలు చేస్తున్నారు.

జిల్లాలో 2005లో మంజూరు చేసిన శ్రీశైలం సొరంగం 10 సంవత్సరాలు గడుస్తున్నా, పూర్తికాలేదు. గత ప్రభుత్వం సరిపోను బడ్జెట్ కేటాయించలేదు. పూర్తి బడ్జెట్ కేటాయించి పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు నక్కలగండి, డిండి, పెండ్లిపాకల, బ్రాహ్మణవెల్లంలను ఒక సంవత్సరంలో పూర్తి చేయాలి. శ్రీరాంసాగర్ వరద కాలువ ద్వారా చివరి గ్రామాలకు మెట్ట భూములకు, మునగాల, నడిగూడెం, మోతె మండలాలకు కాలువలు త్రవ్వించి సాగునీరు, త్రాగునీరు అందించాలి.

గుర్రంపోడు మండంలోని చేపూర్ మంచినీటి ప్రాజెక్టు ద్వారా మండలంలోని అన్ని గ్రామాలకు మంచినీరు అందించాలి. చాలా గ్రామాలకు 10 రోజులకు ఒకసారి కూడా నీళ్ళు రావడంలేదు. పల్లిపహాడ్, కొత్తలాపురం, తేరాటిగూడెం, బొల్లారం తదితర గ్రామాలకు నీళ్ళు రావడంలేదు.

జిల్లాలోని రైతాంగం గత మూడు సంవత్సరాల నుండి అతివృష్టి, అనావృష్టి వలన పంటలు దెబ్బతిని ఎండిపోయి కుటుంబాలను పోషించుకోలేక అప్పులలో కూరుకుపోయినందున కాలపరిమితి లేకుండా వ్యవసాయ రుణాలన్నీ రద్దుచేసి, కొత్తరుణాలు ఇప్పించాలి. వ్యవసాయ సీజను ప్రారంభమై నెలరోజులు దాటింది. ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలుచేసి వ్యవసాయ అవసరాలకు ప్రైవేటు వ్యాపారస్తుల దగ్గరకు పోయి ఇబ్బందులుపడుతున్న రైతాంగాన్ని ఆదుకోవాలి. కేంద్రప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, ఎరువులు, పురుగుమందులు, సిమెంట్, స్టీలుధరలు తగ్గించాలి. ఈ డిమాండ్లతోకూడిన మెమోరాండంను ధర్నా అనంతరం జిల్లా కలెక్టరుకు అందజేశారు. ✡

# యస్‌టిఎమ్ కంపెనీ దురాక్రమించిన భూములను ప్రజలపరం చేయాలని ఆందోళన

**పార్వతీపురం, 2-6-14 :**

పార్వతీపురం మండలం సంగంవలస పంచాయితీ పరిధిలో 1994 సంవత్సరంలో స్టెర్లింగ్ ట్రీమాగ్నమ్(యస్‌టిఎమ్) కంపెనీ టేకు మొక్కలు నాటే పేరిట 214.74 ఎకరాలు కొనుగోలు చేసింది. ఈ టేకు ప్లాంటేషన్ గురించి పట్టణాల్లో, మధ్యతరగతి, వ్యాపారవర్గాల్లో 'ఒక చెట్టుకొంటే లక్షాధికారి అవుతార'నే బూటకపు ప్రచారంతో అనేకమందితో డబ్బు కట్టించు కొని వాటాదారులుగా చేర్చుకొని వారిని మోసం చేసింది. టేకుచెట్లు పెంచకుండా వదిలేసింది. కంపెనీ దళారులుగా ఇప్పుడు కొందరు వచ్చి ఆ స్థలంలో పెరిగిన టేకు చెట్లను కొట్టుకెళ్ళి అమ్ముకునే ప్రయత్నాలు చేస్తున్నారు. దీనికి అధికార్లు వంతపాడుతున్నారు.

ఈ నేపధ్యంలో రైతుకూలీసంఘం(ఆం.ప్ర) ఆధ్వర్యంలో విజయనగరంజిల్లా, పార్వతీపురం మండల తహసిల్‌దారు ఆఫీసువద్ద 200మందికి పైగా ప్రజానీకం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా కార్యదర్శి కా॥డి.వర్మ మాట్లాడుతూ వాటాదారుల పేరుతో మోసం చేయటమేగాక, ప్రభుత్వ అధికారులతో కుమ్మక్కు అయిన యస్‌టిఎమ్ కంపెనీ భూముల కొనుగోలులోనూ అనేక అవకతవకలకు పాల్పడిందన్నారు. యస్‌టిఎమ్ తీసుకున్న భూముల్లో బంజరు, డి-పట్టా, పోరంబోకు, గెడ్డలును స్వాధీనం చేసుకున్నారని, గిరిజనులకు కనీసపాటి రక్షణగా వున్న 2/56 చట్టం అమలులోవున్న ఒరిస్సా రాష్ట్రం-బందుగాం బ్లాకు ప్రాంతంలోని గిరిజనుల భూములను 230 ఎకరాలు కొనుగోలు చేశారని, ఆ భూములను రైతుకూలీసంఘం నాయకత్వంలో గిరిజనులు పునఃస్వాధీనం చేసుకొని సాగుచేసుకున్నారని ఆయన గుర్తుజేశారు. సంగంవలస గ్రామం ఏజన్సీకి ఆనుకొని వుండటంతో తక్కువ ధరలకు భూములు కొనుగోలు చేసి, అక్కడి టేకు చెట్లను నరికి కోట్ల రూ॥ సంపాదించే ప్రయత్నంలో వున్నారని, వీటన్నింటిపై పూర్తిస్థాయి విచారణ జరిపించి యస్‌టిఎమ్ యాజమాన్యం మరియు దళారులపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. టేకు ప్లాంటేషన్ పేరుతో మోసగించబడిన వాటాదారులకు కంపెనీ యాజమాన్యంచే నష్టపరిహారం ఇప్పించాలని, యస్‌టిఎమ్ దురాక్రమించిన ఈ భూములను సంగవలస ప్రాంతంలోని గిరిజనులకు, పేదలకు పంపిణీ చేయాలని కా॥వర్మ డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం పార్వతీపురం తహశిల్‌దారుకు డిమాండ్లతో కూడిన మెమోరాండం అందించారు. ఈ కార్యక్రమంలో ఇంకా రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా నాయకులు కామ్రేడ్స్ ఎమ్. భాస్కరరావు, శ్రీనునాయుడు, నర్సింగరావు తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు. ✡

## రైతుల వ్యవసాయ... (చివరిపేజీ నుండి)

పాల్గొన్న సంఘ నాయకులు డిమాండ్ చేశారు. 11-7-14న జరిగిన ఈ ధర్నాలో కౌలురైతులు, డ్వాక్రా మహిళలు పాల్గొని రుణాల రద్దును డిమాండ్‌చేస్తూ నినదించారు. రైతుకూలీసంఘం జిల్లా సహాయ కార్యదర్శి కా॥ యు. వీరబాబు మాట్లాడుతూ ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు మొదలుకొని వ్యవసాయ అవసరాల ధరలన్నీ పెరిగిపోవటంతోపాటు, ప్రభుత్వ సబ్సిడీల కోత, మరోవైపున గిట్టుబాటు ధరలు కల్పించక పోవటమే రైతాంగం రుణఊబిలో కూరుకుపోవటానికి కారణమని పేర్కొన్నారు. ఈ మూలకారణాన్ని పరిష్కరించుకోవటానికి మరియు తక్షణం రుణమాఫీ కోసం ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ ధర్నాలో ఇంకా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బొట్టు సాంబశివారెడ్డి, చింతయ్య తదితరులు పాల్గొన్నారు. కంకిపాడు మండల తహశిల్దారుకు మెమోరాండం అందచేశారు.

**నందిగామ, 11-7-14 :**

రైతుల, కౌలురైతుల, డ్వాక్రా మహిళల, చేనేత కార్మికుల రుణాలను పూర్తిగా రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ 11-7-14న నందిగామ మండల కార్యాలయం ఎదుట రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ ధర్నాలో రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) జిల్లా నాయకులు కా॥ జె. జగన్ పాల్గొని ప్రసంగిస్తూ రుణాల రద్దు హామీతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఆపై దానికి తూట్లుపొడుస్తున్నాడన్నారు. జిల్లాలో ఇప్పటికే రైతాంగం ఆత్మహత్యలు జరుగుతున్నాయని, ప్రస్తుత వర్షాభావం, సాగునీరు విడుదల చేయకపోవడం, రుణభారాలతో ఈ సమస్య మరింత తీవ్రం కాకమునుపే కనీస ఉపశమనం కలిగించే రుణమాఫీ పథకాన్ని ప్రభుత్వం వెంటనే అమలుచేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు కా॥ ఎమ్. రాంబాబు, యాదల నాగేశ్వరరావు, ఆర్. కోట్యా నాయక్ తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు. స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కార్యదర్శి కా॥ ఎమ్. కామేశ్వరి ధర్నాలో పాల్గొని సంఘీభావం తెలియ చేశారు. అనంతరం మండల తహసిల్దారుకు మెమోరాండం అందచేశారు. ✡

*Read !* *Subscribe!!*




*English Organ of*
*Central Committee of CPI (ML)*

# ‘మార్క్సిజం-లెనినిజాన్ని నిరంతరం అధ్యయనం చేయాలి! ప్రజలతో మమేకం కావాలి!!’

## కామ్రేడ్ కానేటి మోహనరావు సంస్మరణ సభలో వక్తల ఉద్ఘాటన



కానేటి సంస్మరణసభలో నివాళులర్పిస్తున్న నేతలు

**కాకినాడ, 12-7-14 :**

మార్క్సిజం-లెనినిజాన్ని నిరంతరం అధ్యయనం చేయాలని, ప్రజలతో మమేకమై వారిని చైతన్యవంతం చేయాలని కామ్రేడ్ కానేటి మోహనరావు ఎప్పుడూ తపన చెందేవారని 12-7-2014 మధ్యాహ్నం 3 గం॥ లకు కాకినాడ అంబేద్కర్ భవన్‌లో రైతుకూలీ సంఘం(ఆం.ప్ర) ఆధ్వర్యంలో జరిగిన కామ్రేడ్ కానేటి మోహనరావు సంస్మరణసభలో సంఘ రాష్ట్రఅధ్యక్షురాలు కా॥ సింహాద్రి ఝాన్సీ అన్నారు. ప్రజావైరుధ్యాలను, ప్రజాసమస్యలని పరిష్కరించడంలో కా॥ కానేటి దిట్ట అని ఆమె కొనియాడారు. లక్షింపేట, చుండూరులాంటి సంఘటనలలో కోర్టులు, చట్టాలు, రాజ్యాంగ వ్యవస్థ, ప్రజాస్వామ్య బూటకత్వాన్ని తేటతెల్లం చేస్తున్నాయని, అయితే ఈ విషయాలను ప్రజలకు చెప్పడంలో ప్రజాచైతన్యాన్ని ప్రోదిచేయడంలో ప్రజాసంఘాలు ఎందుకు విఫలమవుతున్నాయో పునరాలోచించు కోవాలన్నారు. సామ్రాజ్యవాద కంపెనీలు ప్రజలచేత వెట్టిచాకిరి చేయిస్తూ భూమి, సహజ వనరులని నిరాఘాటంగా దోపిడీ చేస్తున్నాయని, ఇది దోపిడీ వ్యవస్థయొక్క నైజమని మనం గుర్తెరగాలని, మనం ప్రజాపునాదులమీద నిలబడి ప్రజలకు ఉద్యమచైతన్యాన్ని అందించి ఉద్యమింపచేయటం మినహా విప్లవానికి దగ్గర దారులేవీ లేవని ఆమె ఘంటాపథంగా చెప్పారు. రాజ్యాంగ వ్యవస్థ యొక్క బూటకత్వం గురించి కానేటి స్పష్టమైన వైఖరితో ఉన్నారని, దాన్ని కూల్చటానికి నిరంతరం అధ్యయనం చేయాలని, యువ కార్యకర్తలని తయారు చేసు కోవాలని ఆయన తపన చెందేవారని, అందుకే తన వద్ద మిగిలిన ఆస్తిని కానేటి లైబ్రరీ ట్రస్టుకు రాసియిచ్చిన చైతన్యశీలి కామ్రేడ్ కానేటి అని ఆయన ఆశయసాధనకు మనం పునరంకితం కావాలని ఆమె పిలుపునిచ్చారు.

వర్గ రాజకీయాలను ప్రజల కందించి, వర్గ ఉద్యమాలలో ప్రజలను రాటుదేల్చిన ధీశాలి కామ్రేడ్ కానేటి అని ‘జనశక్తి’ సంపాదకులు కామ్రేడ్ జస్వంతరావు అన్నారు. కృష్ణా జలాలకు సంబంధించి మొత్తం కృష్ణా పరీవాహక ప్రాంత రాష్ట్రాలతో బోర్డు ఏర్పాటు చేయకుండా కేవలం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలకు బోర్డు ఏర్పాటుచేసి, లేని నీటి విడుదల గురించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ, ప్రజలమధ్య వైషమ్యాలను రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు రెచ్చగొడుతున్నాయని కా॥ జస్వంతరావు పాలకవర్గ స్వభావాన్ని ఎండగట్టారు. కేవలం ఇరవై బడా కుటుంబాలు 40 లక్షల కోట్ల రూ॥లు రుణాలు ఎగ్గొడితే పల్లెత్తు మాట అనని ప్రభుత్వాలు దయనీయ స్థితిలో వున్న రైతాంగానికి లక్ష కోట్ల రూ॥ల రుణమాఫీ ప్రకటించి ఇప్పుడు నిరర్థక ఆస్తులు పోగుపడతా యనటం విడ్డూరంగా ఉందన్నారు. రిలయన్స్ 2015 నాటికి 12 డాలర్లకు గ్యాస్‌ధర పెంచనుందని, దాని ఫలితంగా యూరియా, కరెంట్ ధరలు విపరీతంగా పెరిగి ప్రజల నడ్డివిరుస్తాయన్నారు. ప్రభుత్వమే పెట్టుబడిదారీ సంబంధాలను తీసుకువస్తుందనుకోవడం భ్రమేనని, రైతాంగాన్ని దీర్ఘకాలంపాటు సామ్రాజ్యవాద, భూస్వామ్య దోపిడీకి గురిచేయడమే అవుతుందని కా॥ లెనిన్, కా॥ నాగిరెడ్డి చెప్పిన విషయాలను ఆయన గుర్తుచేశారు. 1950లలో కామ్రేడ్ కానేటి లాంటి వాళ్ళు ఫ్యూడల్ వ్యతిరేక పోరాటాలను ఎంతబలంగా నిర్మించారో ఇప్పుడు కంపెనీల దోపిడీకి వ్యతిరేకంగా తీవ్రమైన పోరాటాలకు సమాయత్తమవ్వడమే కామ్రేడ్ కానేటికి మనమిచ్చే నివాళి అన్నారు.

గొంతు క్యాన్సర్‌తో బాధపడుతూ చనిపోవడానికి ఎనిమిది నెలలముందు భూసంబంధాల గురించి తాము నిర్వహించిన సదస్సులో గంటపాటు అనర్గళంగా ఉపన్యసించిన కామ్రేడ్ కానేటి మోహనరావు తపన, దీక్ష, పట్టుదల నేటితరానికి స్ఫూర్తిదాయకమని దళిత బహుజన వ్యవసాయ వృత్తిదారుల సంఘం రాష్ట్రకార్యదర్శి అయినాపురపు సూర్యనారాయణ అన్నారు. 2008లోనే శాస్త్రవేత్తల బృందం గ్యాస్ వెలికితీతవల్ల భూమి కుంగుతుందని, పైపులైన్లు దెబ్బతింటాయని, వెలికితీత నిలుపుదల చేయాలని హెచ్చరించినా పెడచెవిన బెట్టిన దాని ఫలితమే నగరం దుర్ఘటన అని పేర్కొంటూ పాలకుల, అధికారుల నిర్లక్ష్యాన్ని తీవ్రంగా దుయ్యబట్టారు.

వర్గరహిత సమాజస్థాపనకోసం ప్రతినబూనటమే కా॥కానేటికి నివాళి అని ఏఐటియుసి రాష్ట్ర నాయకులు కా॥చెలికాని స్టాలిన్ అన్నారు. పార్లమెంటేరియనిజం రుచి చూసి దాని భ్రమలకు లోనుకాకుండా చిట్టచివరి వరకూ ధృఢమైన విప్లవనేతగా నిలబడ్డ కామ్రేడ్ కానేటి నేటితరానికి ఆదర్శం అని అన్నారు. నిలకడగా, నిబద్ధతతో పనిచేశారన్నారు. మనకు తెలియకుండానే మనజేబులు కొల్లగొట్టే విధానాలు నేడు సాగుతున్నాయని, వాటికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలు ఎందుకు విడిపోతున్నాయో ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) తూర్పుగోదావరిజిల్లా అధ్యక్షులు కామ్రేడ్ వనచర్ల సుబ్బారావు బట్టేలంకలో 1950లలో 78 రోజులపాటు జరిగిన సమ్మెను గుర్తుచేస్తూ ఆనాడు కా॥కానేటి మోహనరావు, కందికట్ల నాగభూషణం తదితరుల భూస్వామ్య, జమిందారీ వ్యతిరేక పోరాటశీలతను తెలియజెప్పారు. దాన్నుంచి నేటి యువత పోరాట స్ఫూర్తిని పొందాలని ఆకాంక్షించారు. ఆర్.పి.ఐ. రాష్ట్ర కార్యదర్శి రామేశ్వర రావుగారు దళిత, విప్లవ శక్తుల ఐక్యఉద్యమాలు నేటి ఆవశ్యకత అని వివరించారు.

సభకు అధ్యక్షత వహించిన కా॥యమ్.యస్. నాగరాజు మాట్లాడుతూ కామ్రేడ్ కానేటి మోహనరావు తూర్పుగోదావరి జిల్లాలో వ్యవసాయ కూలీ ఉద్యమాలను నిర్మించిన క్రమాన్ని వివరించారు. దళితుల, మత్స్యకారుల, పీడితుల సమస్యల పరిష్కారానికై చట్టాలు చేయించడంలో కా॥కానేటి కృషి శ్లాఘనీయమన్నారు. ఎప్పుడూ పార్టీ, సంఘం నిర్మాణం గురించి, కమిటీల పనితీరు గురించే కా॥కానేటి మాట్లేడేవారని కా॥ ఎంఎస్ నాగరాజు గుర్తుచేశారు. తన వ్యక్తిగత ప్రతిష్ట, గొప్పదనం గురించి కాకుండా సమిష్టి ఉద్యమాల ఫలితమే ఆనాటి వ్యవసాయకూలీ దళిత ఉద్యమాలని కా॥కానేటి అనేవారని బరువెక్కిన హృదయంతో కా॥నాగరాజు కానేటి విశిష్టత గురించి సభకు పరిచయం చేశారు. కా॥కానేటి ఏ ఆశయంతో లైబ్రరి ట్రస్టును ఏర్పర్చారో ఆయన ఆశయసాధనకు రైతుకూలీసంఘం కృషిచేస్తుందన్నారు. ముందుగా సభికులు రెండు నిముషాలు మౌనం పాటించి కా॥ కానేటికి శ్రద్ధాంజలి ఘటించారు. ఉభయగోదావరి జిల్లాలనుండి, సుదూర ప్రాంతాలనుంచి వచ్చిన దళిత, విప్లవ, వివిధ ప్రజాసంఘాల సభ్యులు దాదాపు 500మంది అత్యంత శ్రద్ధాసక్తులతో, లోతుగుండెలతో, క్రమశిక్షణతో సభను ఆలకించారు.

రెండు రోజులుగా పడుతున్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా తడిసి ముద్దవుతూనే కా॥కానేటికి నివాళులర్పించడానికి వచ్చిన జనంయొక్క దీక్ష, పట్టుదల ప్రస్తావనార్హం. ✡

# రైతుల వ్యవసాయ పంటరుణాలు, డ్వాక్రా మహిళల, చేనేత కార్మికుల రుణాలు పూర్తిగా రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా



కంకిపాడులో ధర్నా;



బందరులో ధర్నా;



నల్గొండలో ధర్నా

**బందరు, 14-7-14 :**

వ్యవసాయ పంటరుణాలు, డ్వాక్రా, చేనేత రుణాలు పూర్తిగా రద్దుచేయాలని, రైతులకు, డ్వాక్రా మహిళలకు, చేనేత కార్మికులకు, కౌలు రైతులకు కొత్తగా రుణాలు మంజూరు చేయాలని, ఖరీఫ్ పంటకు సాగునీరు తక్షణమే విడుదల చేయాలని డిమాండు చేస్తూ రైతుకూలీసంఘం (ఆం.ప్ర) కృష్ణాజిల్లా కమిటి ఆధ్వర్యంలో 14.7.2014 తేదీన మచిలీపట్నంలో కృష్ణాజిల్లా కలెక్టరు కార్యాలయం ఎదుట జిల్లా స్థాయి ధర్నాను నిర్వహించారు.

ఈ ధర్నా కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర కార్యదర్శి కా॥ కొప్పుల కోటయ్య, రైతులు, డ్వాక్రా మహిళలు, చేనేత కార్మికుల అప్పులను రద్దుచేస్తామని, కొత్త రుణాలు మంజూరు చేస్తామని, కాబట్టి బ్యాంకులకు రుణాలు కట్టొద్దని ఊరూరా ప్రచారం చేసిన తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు, అధికార పీఠం ఎక్కాక రుణమాఫీ గురించి స్వరం మార్చి, పథకానికి తూట్లు పొడిచేందుకు సిద్ధపడ్డాడన్నారు. దీనిపై మాజీ నాబార్డు ఛైర్మన్ పగడి కోటయ్య నేతృత్వంలో కమిటి ఏర్పాటు చేయడం ద్వారా కాలయాపనకు పూనుకొన్నాడని, కుటుంబంలో ఒక్క రుణం మాత్రమే రద్దుచేస్తామని, బోగస్ రైతుల ఏరివేత పేరుతో ఆధార్‌కు లింక్ చేస్తామనడం ద్వారా రుణమాఫీ పథకాన్ని నామమాత్రం చేయదల్చుకొన్నాడని, రుణమాఫీ పథకం అమలుకోసం సమైక్యంగా రైతాంగం, డ్వాక్రా మహిళలు, చేనేత కార్మికులు ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా కార్యదర్శి కా॥ ముప్పాళ్ళ భార్గవశ్రీ మాట్లాడుతూ రుణమాఫీచేయడంలో చంద్రబాబునాయుడు ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేదని ఇప్పటికే తేలిపోయిందని, రుణాలను రీ షెడ్యూల్ చేయడం వల్ల రైతుకు మేలుకల్గకపోగా చాలా నష్టం జరుగుతుందని, స్వల్పకాలిక రుణాలు దీర్ఘకాలిక రుణాలుగా మారి, 7 శాతం వడ్డీకి బదులు 11 నుండి 14 శాతం వడ్డీ అదనంగా చెల్లించాల్సి రావటంతో అప్పు తడిసి మోపెడై రైతులకు చెల్లింపు భారంగా మారుతోందన్నారు. ఈ స్థితిలో రైతాంగం సమైక్యంగా ఉద్యమించటం ద్వారా ఈ రుణమాఫీ అమలును సాధించుకోవాలనిపిలుపునిచ్చారు. ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర కార్యదర్శి కా॥ యద్ధనపూడి సోని ప్రసంగిస్తూ 2004-05 సం॥ నుండి 2013-14 సం॥ వరకు బడా పరిశ్రమాధిపతులకు, బడా వ్యాపారులకు, విదేశీ కంపెనీలకు పన్నుల రాయితీలు, బ్యాంకు రుణాలు రద్దు, పరిశ్రమల ఏర్పాటు సందర్భంగా కల్పించే భూమి, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలకు పాలకులు 33.22 లక్షల కోట్లు లబ్ధి చూకూర్చారని, కానీ దేశానికి అన్నం పెట్టే రైతాంగానికి వ్యవసాయ, పంటరుణాలు మాఫీ చేయడంలో మీనమేషాలు లెక్కిస్తూ తాత్సారం చేయడం దుర్మార్గమని అన్నారు.

2013 సం॥లో 40 బ్యాంకులు 2.22 లక్షల కోట్ల రుణాలను నిరర్థక ఆస్తులుగా ప్రకటించి రద్దు చేసినప్పుడు బ్యాంకుల మనుగడ దెబ్బతినలేదుగాని రైతుల, డ్వాక్రా మహిళల, చేనేత కార్మికుల రుణాలు రద్దుచేస్తే బ్యాంకులు దెబ్బతింటాయా? అని ప్రశ్నించారు. ఇంకా రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా సహాయ కార్యదర్శి కా॥ యు. వీరబాబు, జిల్లా కోశాధికారి కా॥ తలసిల లీలా మనోహర్, జిల్లా నాయకులు కా॥ ఎం. రాంబాబు, కా॥ జె. జగన్, బొట్టా సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇంకా స్త్రీ విముక్తి సంఘటన, ఓపిడిఆర్, ఏఐఎఫ్‌టియు(న్యూ), రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) సంఘాల ప్రతినిధులు పాల్గొని సంఘీభావం తెలిపారు. జిల్లా ధర్నాలో మచిలీపట్నం, చిన్నాపురం, కంకిపాడు, విజయవాడ, నందిగామ ప్రాంతాల నుండి రైతుకూలీలు, కౌలురైతులు, డ్వాక్రా మహిళలు, చేనేత కార్మికులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టరుకు మెమోరాండం సమర్పించారు.

**చల్లపల్లి, 9-7-14 :**

రైతుల వ్యవసాయ పంటరుణాలు, డ్వాక్రా మహిళల, చేనేత కార్మికుల రుణాలను పూర్తిగా రద్దుచేయాలని, ఖరీఫ్ సీజన్‌కు సాగునీరు తక్షణమే విడుదల చేయాలని డిమాండు చేస్తూ, రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) ఆధ్వర్యంలో 9.11.2014 తేదీన చల్లపల్లి తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా జరిగింది. ఈ సందర్భంగా రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) జిల్లా నాయకులు కా॥ జె. జగన్ మాట్లాడుతూ దేశానికి అన్నంపెట్టే రైతుల రుణాలను మాఫీ చేసేందుకు పాలకులు సిద్ధపడటంలేదని, రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం గురించి నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ఈ ధర్నాలో రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) జిల్లా కోశాధికారి కా॥ తలసిల లీలా మనోహర్, చల్లపల్లి ఏరియా శాఖ కార్యదర్శి కా॥ ఈపూరి రాంబాబు పాల్గొని నాయకత్వం వహించారు. అనంతరం చల్లపల్లి మండల రెవిన్యూ తహసీల్దారుగార్కి మెమోరాండం సమర్పించారు.

**కంకిపాడు, 11-7-14 :**

పేద, సన్న చిన్నకారు రైతులు, కౌలురైతులకు ప్రయోజనం చేకూర్చేలా రుణమాఫీ పథకాన్ని సమగ్రంగా రూపొందించి అమలుచేయాలని కృష్ణాజిల్లా కంకిపాడు మండల కార్యాలయం వద్ద రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో

(తరువాయి 7వ పేజీలో)

Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010